నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 15-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 120 | పేజీలు: 4 | వెల: రూ.1/-

అయేషా మీరా మృతదేహం వెలికితీత

గుంటూరు, డిసెంబర్ 14: తెనాలిలోని చెంచుపేటలోని శ్మశాన వాటికలో అయేషా మీరా మృతదేహాన్ని వెలికితీశారు. సీబీఐ అధికారులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో మృతదేహం ఆనవాళ్లను కూలీలు బయటకు తీశారు. మృతదేహం ఆనవాళ్లను ఫోరెన్సిక్ నిపుణులు నమోదు చేసుకుంటున్నారు. ఎముకలు, కేశాలు, గోళ్లను నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఫోరెన్సిక్ బృందం ఆధారాలు సేకరించి నివేదిక తయారు చేయనుంది.అయేషా మీరా మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించాలని సీబీఐ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెనాలి మూడో పట్టణ పోలీసులు శనివారం ఉదయం 6 గంటలకే శ్మశాన వాటికకు చేరుకున్నారు. సీబీఐ విచారణలో భాగంగా రీ పోస్టుమార్టం కోసం పోలీసులు ఏర్పాట్లు చేశారు.2007, డిసెంబర్ 27న అయేషా మీరా హత్యకు గురైంది. ఈ కేసులో నిందితుడైన సత్యం బాబును 2008, ఆగస్టు 11వ తేదీన అరెస్టు చేశారు. 2010లో సత్యం బాబుకు 14 ఏళ్ల జైలు శిక్ష విధించింది విజయవాడ మహిళా సెషన్స్ ప్రత్యేక కోర్టు. 2017, మార్చి 31న సత్యంబాబు నిర్దోషిగా హైకోర్టు తీర్పునిచ్చింది. ఎనిమిదేళ్లు జైలు జీవితం తర్వాత సత్యంబాబు విడుదలయ్యారు. 2018, నవంబర్ 29న సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశించింది. 2019, జనవరిలో సీబీఐ విచారణ ప్రారంభించింది.

దిశ ఘటన మరువక ముందే మరో అత్యాచార ఘటన

ఆటో కోసం వేచి చూస్తున్న అక్కాచెల్లెళ్లపై అత్యాచారం
బాలికలపై అఘాయిత్యం చేసిన దుండగుల అరెస్ట్

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ ఘటన' మరువక ముందే హైదరాబాద్‌లో మరో దారుణం చోటు చేసుకుంది. ఈ నెల 8న జరిగిన అత్యాచార ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అయితే పోలీసులు కేసు నమోదు చేసుకుని ఘటనపై ఆరా తీయడంతో పాటు, దోషులను అరెస్ట్ చేశారు.

ఇక వివరాల్లోకి వెళితే....ఈ నెల8న ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన అక్కాచెల్లెళ్లను ఇద్దరు వ్యక్తులు మభ్యపెట్టి దారి మళ్లించి అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. చాంద్రాయణగుట్ట చౌరస్తాకు సమీపంలోని హోషామాబాద్‌లో నివసించే ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఐదు రోజుల క్రితం చార్మినార్ వెళ్లేందుకు ఆటో కోసం రోడ్డుపై నిల్చున్నారు. అదే సమయంలో వారిపద్దకు వచ్చిన ఆటో డ్రైవర్ మహ్మద్ అమీర్ తాను తీసుకెళ్తానని ఆటో ఎక్కించు కున్నాడు. అనంతరం ఆటో డ్రైవర్‌తో పాటు మరొకరు.. అక్కాచెల్లెళ్లపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. తీవ్ర రక్తస్రావం కావడంతో భయాందోళనకు గురైన ఆ బాలికలు తమను జహంగీర్‌పీర్ దర్గాకు తీసుకెళ్లాలని చెప్పడంతో.. సాయంత్రం సమయంలో దర్గాకు వెళ్లడం సురక్షితం కాదని చెబుతూ పట్టేపల్లిలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. రాత్రికి అక్కడే పడుకుని ఉదయం వెళ్లాలని సూచించి బయటకు వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత ఆటో డ్రైవర్ సోదరుడు మూసా వారిని తన బైక్‌పై రాత్రి సమయంలో నాంపల్లికి తీసుకెళ్లాడు. మాయమాటలతో వారిద్దర్నీ లాడ్జికి తీసుకెళ్లాడు. అక్కడ కోరిక తీర్చాలంటూ అక్కను వేధించాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో చెల్లెలిని చంపేస్తానని బెదిరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. హైదరాబాద్ లో ఆటోడ్రైవర్ అమీర్‌ను అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్ తరలించారు. ఈ లోగా ఇద్దరు బాలికలు కనిపించడం లేదంటూ కుటుంబసభ్యులు చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాంపల్లిలో ఇద్దరు బాలికలు ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు వారిద్దర్నీ స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసుల విచారణలో బాలిక(18) తనపై జరిగిన అఘాయిత్యం గురించి చెప్పడంతో పోలీసులు మూసాతో పాటు ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 8వ తేదీన ఈ ఘటన జరగగా, అలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులను విచారించిన పోలీసులు అత్యాచారం జరిగినట్టు తెలుసుకున్నారు. నాంపల్లిలోని హోటల్‌కు వెళ్లి విచారించగా, ఓయో రూమ్ కోసం నిందితుడు నకిలీ గుర్తింపు కార్డులిచ్చినట్టు గుర్తించారు.

గంగానదిలో విహరించిన ప్రధాని మోదీ

లక్నో, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌లోని అటల్ ఘాట్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ పవిత్ర గంగానదిలో విహరించారు. ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ సీనియర్ నేతలతో పాటు ఎన్డీఏ మిత్రపక్ష నేతలు మోదీ వెంట ఉన్నారు. యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్, ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్, బిహార్ డిప్యూటీ సీఎం సుశీల్ మోదీ గంగానదిలో పర్యటించారు. అంతకుముందు చంద్రశేఖర్ ఆజాద్ యూనివర్సిటీలో మోదీ అధ్యక్షతన జరిగిన నేషనల్ గంగా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా హాజరయ్యారు. అనంతరం కేంద్రమంత్రులు, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి మోదీ బోట్‌రైడ్‌కు వెళ్లారు. మోదీ సర్కార్ నమామి గంగ ప్రాజెక్టు పేరిట గంగానది ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. గంగానది పరివాహక ప్రాంతాలైన పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ పర్యటనకు గైర్హాజరయ్యారు.

పథకాలను, సబ్సిడీలను
లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి: హరీష్‌రావు

సంగారెడ్డి, డిసెంబర్ 14: ప్రభుత్వ పథకాలను, సబ్సిడీలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. సంగారెడ్డిలో షెడ్యూల్ కులాల సేవ సహకార అభివృద్ధి సంస్థ రుణమేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ చెక్కులను మంత్రి హరీష్‌రావు పంపిణీ చేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలోని మహిళా సంఘాలకు రూ.75 కోట్ల బ్యాంక్ లింకేజీ ఇస్తున్నట్లు తెలిపారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ విధానం ద్వారా మహిళలను ప్రోత్సహిస్తున్నామన్నారు. 300 మంది అబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ఎనిమిది స్వచ్ఛ్ ఆటోలు ఇస్తున్నట్లు చెప్పారు.

సంగారెడ్డిలో రూ.20 కోట్లతో ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను, సబ్సిడీలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. షెడ్యూల్ కులాల కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందన్నారు. నిరుద్యోగ సమస్య లేకుండా వ్యాపారం చేసుకునే విధంగా రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు

మోదీ - అమిత్‌షా నుండి..
దేశాన్ని కాపాడుదాం

- భారత్ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేశారు
- మతంపేరుతో విభజించేందుకు వాళ్లు పనిచేస్తున్నారు
- దేశ ప్రజలకు తక్షణమే మోదీ-షాలు క్షమాపణలు చెప్పాలి
- తనను క్షమాపణ చెప్పమని పార్లమెంట్‌లో డిమాండ్‌చేశారు
- నిజం మాట్లాడేవాళ్లు క్షమాపణలు చెప్పరని తెగేసి చెప్పా
- తాను రాహుల్ సావర్కర్‌ను కాదు.. రాహుల్ గాంధీని
- ఈశాన్య ప్రాంతాల గోడు వినే పరిస్థితి లేకుండా పోయింది

- 'భారత్ బచావో' ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

- పౌరసత్వ సవరణ చట్టంతో భారతీయ ఆత్మ ముక్కలు చెక్కలవుతుంది - సోనియాగాంధీ

- రైతుల ఆత్మహత్యలు చేసుకుంటుంటే పట్టదా - ప్రియాంకగాంధీ

న్యూఢిల్లీ, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : మోదీ - అమిత్‌షాలు భారత్ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేశారని, ప్రజల జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారని వారినుండి దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ 'భారత్ బచావో' పేరుతో రాంలీలా మైదానంలో ర్యాలీ నిర్వహించింది. కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. తర్వాత జరిగిన సభలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకగాంధీ, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ పాలిత సీఎంలు, పీసీసీ చీఫ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. దేశానికి క్షమాపణ చెప్పాల్సింది తాను కాదనీ, ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన ప్రధాని మోదీ, ఆయన సహచరుడు అమిత్‌షాలే దేశానికి క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీ అన్నారు. పార్లమెంటులో తనను క్షమాపణ చెప్పమని బీజేపీ అడిగినప్పుడు, నిజం మాట్లాడేవాళు క్షమాపణలు చెప్పరని తాను తెగేసి చెప్పానన్నారు. తాను రాహుల్ సావర్కర్‌ను కాదని, రాహుల్ గాంధీనని కమలనాథులకు ఆయన చురకలు వేశారు. భిన్న జాతులు, భిన్నమతాలు, భిన్న సంస్కృతీ సంప్రదాయలకు నిలయమైన భారతదేశంలో ఇప్పుడు ఏమి జరుగుతోందని యావత్ ప్రపంచం మనవైపు చూస్తోందన్నారు. ఇవాళ దేశ పరిస్థితి ఏమిటనేది ప్రజలందరికీ తెలుసునని, మతంపేరుతో విభజించేందుకు వాళ్లు (ప్రభుత్వం) పనిచేస్తున్నారని అన్నారు. 'జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, అసోం, మిజోరాం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ ఇలా ఇవాళ ఎక్కడికైనా వెళ్లండి... మోదీ ఏం చేశారో అందరికీ తెలుస్తుంది. ఆయా ప్రాంతాల్లో మంటలు పెట్టారు' అని రాహుల్ ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను ప్రధాని ధ్వంసం చేశారని, రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేసినప్పుడు ఎన్నో అబద్దాలు చెప్పారని, నల్లధనం వెనక్కి తెస్తామన్నారని, అవినీతి నిర్మూలిస్తామని చాలా మాటలు చెప్పారని, అయితే ఆపని చేయగలిగారా? అని ప్రశ్నించారు. లక్షల కోట్లు అదానీ, అనిల్ అంబానీల జేబుల్లో వేశారని ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టంపైనా రాహుల్ విమర్శలు గుప్పించారు. ఈశాన్య ప్రాంతాల గోడు వినే పరిస్థితి లేకుండా పోయిందని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని మోదీ సర్కార్ బలహీనపరిచిందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, ఆర్థిక వ్యవస్థ ఐసీయూలో ఉందని విరుచుకుపడ్డారు.

ఇవాళ జీడీపీ వృద్ధి 4 శాతం మాత్రమేనని, మార్పులు చేసిన జీడీపీ ప్రకారమే ఈ గణాంకాలని, గతంలో సూచీగా తీసుకున్న లెక్కల ప్రకారమైతే వృద్ధి రేటు 2.5 శాతం మాత్రమేనని అన్నారు. రాహుల్ ప్రసంగం సమయంలో పలుమార్లు రాహుల్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

భారతీయ ఆత్మ ముక్కలు చెక్కలు - సోనియాగాంధీ

కేంద్రంలోని మోదీ సర్కార్ తీరు, అనుసరిస్తున్న విధానాలు, మోదీ వైఫల్యాలపై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ నిప్పులు చెరిగారు. ఒక అధికరణను బలవంతంగా రుద్దాలన్నా, తొలగించాలన్నా, రాష్ట్ర హోదా మార్చాలన్నా...ఇలా వారికి ఏది తోస్తే అలా చేస్తూ పోతున్న పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఎప్పుడు అనుకుంటే అప్పుడు రాష్ట్రపతి పాలన విధించడం, రద్దు చేయడం, చర్చ లేకుండానే బిల్లులు ఆమోదించుకుంటూ పోతున్నారని మోదీ సర్కార్‌పై మండిపడ్డారు. పౌరసత్వ సవరణ చట్టంతో భారతీయ ఆత్మ ముక్కలు చెక్కలు అవుతున్నా, అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నా మోదీ, అమిత్‌షాలకు ఎలాంటి పట్టింపు లేకుండా పోయిందని సోనియాగాంధీ విమర్శించారు.

నిత్యావసర ధరలు పెరుగుతున్నా పట్టదా? - ప్రియాంకగాంధీ

భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజలను పట్టించుకోవట్లేదని, వారి నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వచ్చిందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. దేశంలో నానాటికీ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, వాటిని అదుపు చేయాల్సిన ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఆర్థిక వ్యవస్థ పతనమైందని, వృద్ధి కోల్పోయి, ద్రవ్యోల్బణం పెరుగుతూ వస్తోందన్నారు. వీటన్నింటి నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. దేశ పౌరులుగా వీటిపై స్పందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

లేదంటే ఈ ప్రభుత్వం చేతుల్లో మన రాజ్యాంగం నాశనమవుతుందన్నారు. 'మోదీ ఉంటే అన్నీ సాధ్యమే' అని భాజపా నినాదాన్ని విమర్శిస్తూ.. 'ఆరేళ్ల భాజపా ప్రభుత్వంలో కొత్త ఉద్యోగాలు కాదు కదా ఉన్న ఉద్యోగాలు పోయాయి. జీఎస్‌టీ వల్ల వ్యాపారులు నష్టపోతున్నారు. రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వ్యాపార సంస్థలు మూతబడుతున్నాయి. ఇవన్నీ భాజపాతోనే సాధ్యమయ్యాయని ఎద్దేవా చేశారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడకపోతే వారిని పిరికి వారిగా చూస్తారని అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ పతనమైందని ఆరోపించారు. అయితే ఆయన మంత్రులు మాత్రం ఏమీ తెలియకుండా మాట్లాడుతున్నారని అన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన పెంచాలి

ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు పిలుపు

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని టీఎస్ ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు అన్నారు. విద్యుత్ పొదుపు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని కూడా సూచించారు. నగరంలోని ఖైరతాబాద్ విశ్వేరయ్య భవన్‌లో విద్యుత్ పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో టీఎస్ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగారావు మాట్లాడుతూ.. ఇళ్లలో విద్యుత్ పొదుపు చేసే పరికరాలను వినియోగిం చాలన్నారు. విద్యుత్ పొదుపు వలన పర్యావరణ పరిరక్షణ సాధ్యం అవుతుం దన్నారు. తెలంగాణలో సౌరవిద్యుత్ వాడకం పెరుగుతోందని, ఇది మంచి పరిణామని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు కారణంగా మనకు ఆదాయం కూడా తగ్గుతుందన్నారు. ఉత్పత్తి కేంద్రాలపై భారం కూడా తగ్గనుందన్నారు. ఎంతో ఖర్చు చేసి మనం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. ఇదంతా రైతులకు తెలియాల్సి ఉందన్నారు. విద్యుత్ పొదుపును ప్రతి ఒక్కరూ పాటిస్తే ప్రభుత్వంపై భారం కూడా తగ్గుతుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉంటే సమస్యుండదన్నారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. విద్యుత్‌ను ఎంత పొదుపు చేస్తే అంత మంచిదన్నారు. విద్యుత్ పొదుపు చేసే ఎలక్ట్రానిక్ వస్తువులనే ఇళ్లలో వాడాలన్నారు. విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నవీన్ మిట్టల్ పేర్కొన్నారు.

మంచిర్యాలలో ఘోర రోడ్డు ప్రమాదం..

- ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

మంచిర్యాల, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భారీ లోడుతో వెళ్తున్న లారీ-కూలీలతో నిండి ఉన్న డీసీఎం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా, 15 మంది గాయపడ్డారు. కలప లోడుతో నిండి ఉన్న లారీని డీసీఎం వెనుక నుంచి ఢీకొట్టినట్లుగా సాక్షులు తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలంలోని ఇందారం గ్రామం మీదుగా 15 మంది కూలీలు డీసీఎంలో పనికి వెళుతున్నారు. ఈ క్రమంలో కాగజ్ నగర్‌కు కర్రలోడుతో వెళ్తున్న లారీని డీసీఎం వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో క్లీనర్‌తో సహా మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. డీసీఎంలో ఉన్న 15 మందికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరణించిన వారి మృత దేహాలను పోస్టుమార్టం కోసం అదే ఆస్పత్రికి తరలించారు. కూలీల్లో కొంత మంది కర్నూలు జిల్లా అనంతపూర్‌కు చెందిన వారిగా తెలుస్తోంది. కూలీ పని కోసం బెల్లంపల్లికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

ఆటో బోల్తాతో కూలీలకు గాయాలు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లిలో రోడ్డు ప్రమాదం సంభవించింది. వృద్ధులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మంది వృద్ధులు గాయపడ్డారు. వీరంతా పింఛను డబ్బు కోసం బాజీపూర్ నుంచి వెలిగొండ వెళ్తుండగా ప్రమాదం బారిన పడ్డారు.

ఆర్టీసీ కార్మికులెవరూ సంతోషంగా లేరు

- డిపోలలో రెండేళ్ల వరకు ఎన్నికలొద్దని సంకేతాలివ్వడం సరికాదు

- ఎన్నికలు జరిగేవరకు ప్రస్తుత గుర్తింపు సంఘాలను గుర్తించాలి

- లేదంటే న్యాయపోరాటం చేస్తాం

- కొందరు అధికారుల కోసమే రిటైర్మెంట్ వయస్సు పెంచారు

- ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : సీఎం కేసీఆర్ తీరుతో ఆర్టీసీ కార్మికులెవరూ సంతోషంగా లేరని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ప్రజాస్వామ్య దేశంలో డిపోల్లో రెండేళ్ల వరకు ఎన్నికలు వద్దంటూ సంతకాలు చేయించడం సరికాదంటూ అభిప్రాయపడ్డారు.

మహిళల డ్యూటీల విషయంలో సీఎం ఆదేశాలను అధికారులు సరిగ్గా పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. కొన్ని బస్సులను రద్దు చేస్తున్నారని, సమ్మె కాలంలో కొందరు అధికారులు చేసిన నిధుల దుర్వినియోగంపై ఏసీబీ విచారణ జరపాలని అశ్వత్థామరెడ్డి డిమాండ్ చేశారు. కొందరు అధికారుల కోసమే రిటైర్మెంట్ వయసు పెంచారని, ప్రస్తుతం ఏ ఒక్క కార్మికుడు కూడా తృప్తిగా పని చేయడం లేదన్నారు. లేబర్ కమిషన్ చెప్పినా మా సంఘాలు వద్దని చెబుతున్నారని, ఆర్టీసీలో యూనియన్లను గుర్తించాలని కోరారు. ఎన్నికలు జరిగేవరకు ప్రస్తుత గుర్తింపు సంఘాలను గుర్తించాలి. లేదంటే న్యాయపోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ప్రజాస్వామ్య దేశంలో ట్రేడ్ యూనియన్లు ఉండాలని, యూనియన్ ఎన్నికలు జరపాల్సిందేనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. యూనియన్లకు సంబంధించి రహస్య ఓటింగ్ పెట్టాలని, మెజార్టీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్షేమ కౌన్సిల్‌లో సభ్యులను ఏ ప్రాతిపదికన తీసుకున్నారో చెప్పాలని అశ్వత్థామరెడ్డి నిలదీశారు. బెంగళూరులో 7 వేల బస్సులు ఉన్నాయని, హైదరాబాద్‌లో 3,500 బస్సుల్లో వెయ్యి బస్సులు రద్దు చేస్తున్నారని అశ్వత్థామరెడ్డి విమర్శించారు. బస్సులను కుదించడం వల్ల ఆదాయం వస్తుందేమో కానీ.. ప్రయాణికులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడతారని అన్నారు. చట్ట వ్యతిరేకంగా కేటాయించే డ్యూటీల్ని ఎత్తివేయాలని, లేకుంటే కార్మికశాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమ్మె కాలంలో కొందరు అధికారులు అవినీతికి పాల్పడ్డారని, వారిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని అశ్వత్థామరెడ్డి డిమాండ్ చేశారు.

విజ్ఞానం, ఆరోగ్య సాధనతోనే..
బంగారు తెలంగాణ సాధ్యం

- వైద్య వృత్తిని అత్యంత సేవాభావంతో నిర్వహించాలి

- శాస్త్ర విజ్ఞానాన్ని మానవ కల్యాణం కోసం వాడాలి

- ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : విజ్ఞానం, ఆరోగ్య సాధనతోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైబర్ కన్వన్షన్‌లో శనివారం ఏర్పాటు చేసిన 6వ తెలంగాణ డెంటల్ కాన్ఫరెన్స్‌ను మంత్రి ఈటల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య వృత్తిని అత్యంత సేవాభావంతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు జెనెటిక్స్, సైన్స్‌కి అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. దంత వైద్యులు గ్రామీణ ప్రాంతాల మీద దృష్టి పెట్టాలన్నారు. 'గజ్వేల్ నియోజకవర్గం నుంచి హెల్త్ ప్రొఫైల్‌ని ప్రారంభించామని, కొత్త దంత కళాశాలల ఏర్పాటు కంటే.. ఉన్న వైద్యులనే సరిగా వినియోగించుకోవాల న్నారు. వైద్యులు లోకపరిజ్ఞానం కూడా పెంచుకోవాలని ఈటల సూచించారు. సమాజంలో స్త్రీ కన్నీరు పెడుతోందని, అది మనకు మంచిది కాదని ఈటల అన్నారు. శాస్త్ర విజ్ఞానాన్ని మానవ కల్యాణం కోసం వాడాలని, తెలంగాణ సర్కారు మానవ సంబంధాలపై కూడా దృష్టి పెడుతోందిని అన్నారు. ఆరోగ్యంలో దేశంలో నంబర్ వన్ స్థానానికి చేరుకునేందుకు కృషి చేస్తున్నామని ఈటల ఈ సందర్భంగా పేర్కొన్నారు. శాస్త్రవిజ్ఞానాన్ని మానవ కల్యాణం కోసంవాడాలని, తెలంగాణ రాష్ట్రం మానవ సంబంధాలపై కూడా దృష్టి పెడుతుందని ఈటెల పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో పూర్తి విశ్వాసం తెచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ప్రాణం పోయినా క్షమాపణ చెప్పను: రాహుల్‌గాంధీ

ఢిల్లీ. డిసెంబర్ 14: ప్రాణం పోయినా క్షమాపణ చెప్పను. మోదీ, అమిత్‌షాయే జాతికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. జార్ఖండ్ ఎన్నికల ప్రచారం సందర్భంగా రాహుల్ గాంధీ ఇది మేకిన్ ఇండియా కాదు.. రేప్ ఇన్ ఇండియా అన్న విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పార్లమెంట్ సమావేశాల్లో సైతం ఆ పార్టీ నేతలు నిరసనలు వ్యక్తం చేస్తూ రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నేడు భారత్ బచావో ర్యాలీని చేపట్టింది. బీజేపీ విభజన, విధ్వంసకర విధానాలకు వ్యతిరేకంగా సభను నిర్వహించింది.

ఈ భారీ బహిరంగ సభకు ఏఐసీసీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మన్మోహన్ సింగ్, చిదంబరం, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ..

దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ స్వయంగా ధ్వంసం చేశారన్నారు. దేశం కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దేశంలో ఉల్లి ధర రూ.200కు పెరిగింది.

తన పేరు రాహుల్ సావర్కర్ కాదని.. రాహుల్ గాంధీ అని అన్నారు. తాను క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. నిజం మాట్లాడినందుకు క్షమాపణ చెప్పాల్నా అని ఆయన ప్రశ్నించారు. రైతులు సంతోషంగా ఉన్నప్పుడే దేశం బాగుపడుతుందన్నారు. మోదీ పాలనలో దేశవ్యాప్త రైతులంతా నిస్పృహలో ఉన్నారన్నారు. మోదీ పేదల నుంచి లాక్కుని అంబానీకి దోచి పెడుతున్నారని రాహుల్ పేర్కొన్నారు.

చరిత్రలో నేటినిజం



స్మయ దూరుని తేరుటకై
రయమున మోర్గమును మాళ్ళ ప్రవచతు డనుచున్
ప్రియమారగ భ్రమలిండును
నయగుణుడగు "స్వామి రంగనాథానందుడే"!!

(డిసెంబర్ 15 స్వామి రంగనాథానంద జననం)

-రాధశ్రీ
సెల్

'మానసిక ఆరోగ్య సంరక్షణం'

దాదాపు 130 కోట్లు దాటిన భారత జనాభాలో మానసిక వత్తిళ్ళతో జన్మత: వచ్చిన లోపాలతో నిస్సారమైన జీవితాలను కొనసాగిస్తున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. ఇటీవలి కాలంలో మానసిక వత్తిళ్ళ కారణంగా ఆత్మహత్యలు పెరిగిపోవడం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా చేపట్టిన 'మానసిక ఆరోగ్య సంరక్షణ శాసనం' అనేక రకాలుగా ఈ జటిల సమస్యకు సరైన పరిష్కారం అందించేదనడంలో ఏలాంటి సందేహం లేదు. ముఖ్యంగా మానసిక సమతూకం లేని వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడటం, అందుకు యత్నించడం అన్నది చాలా తీవ్ర సమస్యగా మారింది. భారత శిక్షాస్మృతిలోని 309 సెక్షన్ ప్రకారం ఆత్మహత్య చేసుకోవడం నేరం. ఒక వ్యక్తిని చంపితే ఎంత నేరమో అంతకంటే ఎక్కువ నేరంగా పరిగణించబడుతుంది. అయితే మానసిక రోగులు ఇలాంటి చర్యలకు పాల్పడితే పరిస్తితి ఏమిటి? అన్ని విధాలుగా సరైన ఆరోగ్యంతో ఉన్న వారితో సమానంగానే వీరి ఆత్మహత్యా యత్నాలనూ నేరంగా పరిగణించాలా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక రోగులు ఆత్మహత్యలకు యత్నించడాన్ని నేరంగా పరిగణించకుండా వారికి సరైన చికిత్సను అందించే మార్గాలనూ సుసంపన్నం చేస్తూ ఈ శాసన రూపకల్పన చేయడం ముదావహం.

ఒక రకంగా చెప్పాలంటే ప్రధాని నరేంద్ర మోదీ తన మన్‌కీబాత్' లో చేసిన సూచనలకు ఈ శాసనంలో తగిన స్థానం లభించింది. మానసిక రోగుల్ని విస్మరించడానికి వీల్లేదని, వారు ఆరోగ్యపరంగా హక్కుల పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై బహిరంగంగానే చర్చించి పరిష్కరించాలంటూ ఉదాత్త రీతిలోనే మోదీ తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. ఆరోగ్య భారతంలో వ్యక్తుల మానసిక, ఆర్థిక జీవన ప్రమాణాలూ కీలకమే. వీటికి అతీతంగా ఈ లక్ష్యాన్ని సాధించడం నేల విడిచి సాము చేయడమే అవుతుంది. ఇప్పటి వరకూ మానసికమైన ఆరోగ్య సమస్యల విషయంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తిన చందంగానే వ్యవహరిస్తున్నాయి. ఒక రకంగా తగిన చికిత్స లేక, తోడుగా ఉండేవారు లేక, ఇలాంటి వ్యక్తులు దిక్కులేని జీవితాన్ని అయోమయ నిస్సార పరిస్థితుల్లో గడపాల్సి వస్తోంది. ఇవి చాలా సందర్భాల్లో ఆత్మహత్యలకూ దారితీస్తాయన్నాయని చెప్పడానికి దుష్టాంతాలెన్నో ఉన్నాయి. సమస్యల్ని దాచుకుంటే ముదిరిపోతాయి ముఖ్యంగా కుటుంబ సభ్యుల్లో మానసిక స్థితిగతులు సరిగా లేని వారి విషయంలో మరింత జాగ్రత్త వహించాలి. వారు ఎపుడు ఎలాంటి చర్యలకు ఒడిగడతారో తెలియదు కాబట్టి అనునిత్యం వారిని కనిపెడుతూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి వ్యక్తులకు తగిన చికిత్సను సరైన సమయంలో అందించగలిగితే కొంతలో కొంతైనా సమస్య తీవ్రతను తగ్గించుకునే అవకాశం కలుగుతుంది. కానీ దురదృష్టం మన దేశంలో మానసిక రోగుల సమస్యలు ముదిరిపోయిన తర్వాత గానీ లేదా ఏమి చేస్తున్నామో తెలియని స్థితిలో వారు ఆత్మహత్యలకు పాల్పడిన తర్వాత కానీ బయటకురాని స్థితి? అందుకే ప్రభుత్వ పరమైన వీరికి ప్రభుత్వ పరమైన తోడ్పాడు తోడయితే ఈ జీవితాలను ఉద్ధరించడం కష్టమేమీ కాదు.

నేటినిజం
ఆదివారం 15-12-2019

అక్షరాన్ని బతికించుకోవాలి

హైదరాబాద్, డిసెంబర్ 14:దేశ భాషలందు తెలుగు లెస్స...అని కృష్ణదేవరాయలు అన్న పలుకు నిజంగానే అర్థత కలిగి ఉంటుంది. తెలుగు అంటే అమ్మభాష. అమ్మభాషలో మాట్లాడుకోవడంలో ఉన్న ఆనందమే వేరు. దూరప్రాంతాలకు వెళ్లి మనవారు ఎవరైనా కలిస్తే మాట్లాడుకుంటే వచ్చే ఆత్మీయత అంతా ఇంతాకాదు. అలాంటి మనభాషను దూరం చేసుకోవడం అంటే ఎంతటి బాధ ఉంటుందో చెప్పలేం. మాతృభాష ప్రజల అన్ని అవసరాలనూ తీర్చగలగాలి. అప్పుడే దానికి మనుగడ. అన్ని కార్యాలయాల్లో ప్రజలు సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం, సంభాషణలు తెలుగులోనే జరపడం వల్ల భాష పట్ల గౌరవం పెరుగుతుంది. మనం మాట్లాడున్నంత కాలం అక్షరం కలకాలం వెలుగు లీనుతుంది. మన ఇంట్లోనే మమ్మీ డాడీ అంటూ మొదలు పెడితే ఆందోళన చెందినట్లుగానే అది అంతమొందుతుంది. భాషకు అధికారిక హోదా ఇచ్చి, అన్నిటా దానికి చెల్లుబాటు పెంచగలిగితే అది ఎల్లకాలం బతుకుతుంది. తెలుగు వెలుగు లీనటానికి నిరంతర చర్యలు తీసుకోవాలి. ఇంగ్లీష్ నేర్చుకుంటూనే తెలుగు నేర్చుకోవడం తప్పనిసరి కావాలి. అప్పుడు మన భాషకు చావులేదు. తెలుగులో మాట్లాడడం, తెలుగులో రాయడం అన్నది గౌరవం గా స్వీకరించాల్సిన సమయమిది. పరభాషలు నేర్చుకుని ఉద్యోగాలు సంపాదించడంలో తప్పు లేదు కానీ మన భాషను వెక్కిరించుకుంటే అమ్మను తిట్టుకోవడమే అవుతుంది. అమ్మల నుంచే ఈ మార్పు రావాలి. ఇంట్లో తప్పనిసరిగా తెలుగు మాట్లాడుకోవడం, తెలుగు అక్షరాలను నేర్పడం, పదాలను నేర్పడం చేయాలి. ఇంగ్లీషుపై తాపత్రయం ఉన్నా.. తెలుగుపై మమకారం వీడరాదు. అమెరికాలాంటి దేశాల్లో స్థిరపడ్డ మన వారు అక్కడ తెలుగుకోసం ఎంతగా తాపత్రయ పడుతున్నారో వారిని చూసి నేర్చుకోవాలి. వారు తమ పిల్లలకు తెలుగుతో పాటు లలితకళలను కూడా నేర్పిస్తున్నారు. ప్రతి ఒక్కరూ మాతృభాష కోసం తాపత్రయ పడాలి. మనభాషలో చక్కగా మాట్లాడు కోవాలి. ఇటీవలి కాలంలో తెలుగుభాష పట్ల చులకన భావం ఏర్పడింది. ఆంగ్లంలో మాట్లాడితేనే హోదా గౌరవం అన్న రీతిలో మన చదవులు సాగుతున్నాయి. ప్రపంచ గమనంలో మనం కూడా విదేశీ భాషలు నేర్చుకుని ముందుకు సాగడంలో అభ్యంతరం లేదు. అలా అని అమ్మభాషను మరచిపోవడం, అక్షరాలే తెలియకుండా పెరగడం మాత్రం మంచిది కాదు. ప్రపంచ తెలుగు మహాసభల నేపథ్యంలో తెలుగు భాష మనుగడ గురించి, ప్రాంతీయ అస్తిత్వాల ప్రాధాన్యం గురించి చర్చలు జరుగుతున్నాయి. తెలుగు ఇంతగా పరిఢవిల్లుతున్న నేలలో మరి ఎందుకని తెలుగు భాష మనుగడ గురించి కలవర పడుతున్నాం. మనభాష అంతమై పోతుందన్న భావనలో ఎందుకో ఏళ్ల తరబడి చర్చోప చర్చలు జరుపుతున్నాం. బతుకుకు భరోసా ఇచ్చేది భాషనే. ఇంగ్లీషే నేర్చుకోవద్దని ఎవరూ అనడం లేదు. ఆంగ్ల మోజులో తెలుగు రాదని చెప్పుకోవడమే దౌర్భాగ్యం కాగలదు. ఇంగ్లీషు మీడియంలో చదువుకున్న వాళ్ళకు ఉద్యోగావకాశాలు పెరగటం, తెలుగు మాధ్యమం నిరుపయోగం అనే భావం విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో గట్టిగా స్థిరపడడడం దీనికి ప్రధాన కారణం. అది ఇప్పటికీ తారస్థాయికి చేరుకుంది. ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లీషులో చదువు నేర్పటం అవసరమనే భావన బలంగా పెరిగింది. అభివృద్ధి చెందిన ఏ దేశంలోనూ మాతృభాషలో తప్ప ద్వితీయ భాషలో పాఠశాల విద్య నేర్పటం లేదు. ప్రయివేటు విద్యా సంస్థలు తామర తంపరగా మొదలై, తరువాత కార్పొరేట్ సామ్రాజ్యాలు ఏర్పడ్డాయి. వాటి ఒత్తిడి, ప్రభావం మొత్తం విద్యా వ్యవస్థనే తలకిందులు చేసింది. తెలుగులో విద్యాబోధన అనేది ఒక పనికిరాని పక్రియ అయిపోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొంతకాలానికి తెలుగు భాష వినిపిస్తూ ఉండొచ్చు కానీ, తెలుగు అక్షరం అదృశ్యం అయిపోతుందని భాషా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంగ్లం లేదా ఇతర భాషల్లో ఎంతగా పట్టు సాధించాలని తల్లిదండ్రులు తమ పిల్లలను రుబ్బు తున్నారో తెలుగులో కూడా అలాగే రుబ్బాలి. అందుకు క్షేత్రస్థాయిలోనే బీజం పడాలి. మన విద్యావిధానాన్ని సమూలంగా సంస్కరించు కోవాలి. ఇంగ్లీషు మీడియం చదువు కొనసాగిస్తున్నా.. అంతేస్థాయిలో మాతృభాష ద్వారా అన్ని స్థాయిల్లోనూ విద్యాబోధన జరగాలి. ఇంగ్లీషును నేర్చుకోవద్దని, నేర్పవద్దని ఎవరూ కోరుకోవడం లేదు. మాతృభాషలో బోధన ఉన్నతవరకు చదువులపై పట్టు పెరుగుతుంది. సాహిత్యం ద్వారా అమ్మభాష నిరంతరం వికసించే అవకాశాలు హెచ్చుగా ఉంటాయి. ఎంతోమంది మహామహులు తెలుగు భాషా వికాసానికి గొప్ప సూచనలూ, మార్గదర్శకాలు రూపొందించి ఇచ్చారు. వాటిని పరిశీలించి, ఆవశ్య మైనవాటిని అమల్లోకి తేవటానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పూనుకోవాలి. దానికోసం సాహిత్య, భాషావేత్తల తో ఒక యంత్రాంగం ఏర్పాటు చేయాలి. ఆంగ్లం అన్నది కేవలం భాషాపరంగానే చూడాలి. ప్రస్తుతం ఆంగ్లానికి ఇస్తున్న ప్రాధాన్యం స్థాయిలో తెలుగులో కూడా క్షేత్రస్థాయి నుంచే బోధన సాగితే పిల్లలకు రెండుభాషలపైనా పట్టు పెరుగుతుంది. రెండు భాషల్లో ప్రావీణ్యం సాధించేలా బోధన జరగాలి. విజ్ఞాన శాస్త్రాలు, సాంకేతిక విషయాలకు సంబంధించి ఆంగ్లంలో బోధన మంచిదే. పిల్లలకు పాఠశాలస్థాయి నుంచి తెలుగులో కథారచన, వక్తృత్వం, సాహిత్య బోధన వంటివి చేపట్టాలి. మాతృభాష వికసించి, పరిమళించాల్సిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సైతం ఆంగ్ల మాధ్యమం ప్రవేశించింది. తెలుగులో కోర్టు తీర్పులు, పాలనలో తెలుగు వాడుక వంటివి కూడా అక్కడక్కడ అప్పుడప్పుడు తప్ప సమూలమైన మార్పు సాధ్యం కావడంలేదు. తెలుగు కేవలం సాహిత్య భాషగా ఉంటే అది పుస్తకాలకే పరిమితం అవుతుంది. తెలుగు సాహిత్యం ద్వారా మన సంస్కృతిని తపస్సునిసరిగా బోధిస్తూనే ఆంగ్లంలో కూడా పట్టు సాధించేలా బోధానా విధానాలు రూపొందించుకోవాలి. అందుకు మన ఇంటి నుంచే విప్లవం రావాలి.

పక్కదారి పడుతున్న తెలంగాణ గొర్రెల యూనిట్లు ?

గ్రామాల్లో ప్రజల ఆందోళన

పంపిణీ పథకం దుర్వినియోగంపై నిఘా

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): మాంసం ఎగుమతుల్లో తెలంగాణ ముందుండాలని, గొర్ల కాపరులు ఆర్థికంగా ఎదిగి రారాజులు కావాలన్న సంకల్పంతో సిఎం కెసిఆర్ ప్రవేశ పెట్టిన గొర్రెల పంపిణీ పథకం దుర్వినియోగం అయ్యిందనే విమర్శలే ఎక్కువ. మాంసం ఎగుమతుల సంగతెలా ఉన్నా గొర్రెల యూనిట్లు ఉన్నాయా అన్న సందేహం కలుగుతోంది. సబ్సిడీ గొర్రెలను అందుకున్న వారు ఎక్కడికక్కడే అమ్ము కున్నారని గ్రామాల్లో ప్రచారం సాగుతోంది. అక్కడక్కడా వచ్చి కొన్ని ఆరోపణలపై గొర్రెల సంరక్షణపై నిఘాను కట్టుదిట్టం చేస్తున్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి తనిఖీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని అమ్ముకుంటే చర్యలు తీసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. గొర్లకాపర్ల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల యూనిట్ల పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తోందన్నారు. పలు చోట్ల గొర్రెల యూనిట్లను అమ్ముకుంటున్నారనే సమాచారంతో యంత్రాంగం అప్రమత్తమైంది. గొర్రెల యూనిట్లు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఆయా మండలాల్లోని ఎంపీడీఓలు, తహసీల్దార్‌లకు బాధ్యతలు అప్పగించారు. వీరు ప్రతీ 15 రోజులకు ఒకసారి ఆయా గ్రామాల్లో అందజేసిన గొర్రెల యూనిట్ల పరిస్థితిని తెలుసుకోవడం ద్వారా నిరంతర నిఘా పెట్టనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గొర్రెల సహకార సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా దుర్వినియోగం జరిగితే రెవెన్యూ రికవరీ యాక్టు కింద వడ్డీతో కలిపి సబ్సిడీ సొమ్మును వసూలు చేస్తామని హెచ్చరికలు సైతం జారీ చేశారు. అంతేకుండా సదరు సంఘాలను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని.. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. సబ్సిడీ కింద వచ్చిన గొర్రెల అమ్మకం.. కొనుగోలు నేరమని పేర్కొంటున్నారు. మొత్తంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేస్తున్నారు. గొర్ల కాపర్లలో అవగాహన పెంచుతోంది. అలాగే సబ్సిడీపై గడ్డివిత్తనాలు ఇచ్చేందుకు కార్యచరణ సిద్ధం చేశారు. గొర్రెలకు సంపూర్ణ రక్షణగొర్రెల యూనిట్ల లబ్ధిదారులకు ఎటువంటి నష్టం వాటిల కుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూనిట్ సొమ్ములో ఇన్సూరెన్స్ కూడా తోడై ఉంది. దీంతో ఏ ఒక్క గొర్రె చనిపోయినా దాని స్థానంలో మరో గొర్రెను అందించనున్నారు. అయితే ఈ వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు నివేదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా గొర్రెల కాపరులకు కూడా ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. ఎవరైనా గొర్ల కాపరులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ లక్ష ఇన్సూరెన్స్ సొమ్ము రానుంది. ఇదిలా ఉంటే గొర్రెల సంరక్షణ కోసం పశువైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. లబ్ధిదారుల వద్దకు చేరుకోగానే వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా టీకాలు వేస్తు న్నా రు. అనారోగ్యానికి గురైన వారికి చికిత్సలు చేసి లబ్ధిదారులకు అండగా నిలుస్తున్నారు. గొర్రెల మేతకు అవసరమైన గడ్డి విత్తనాలను 100శాతం ఉచితంగా అందించేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంపై ఇదివరకే గొర్రెల కాపరులకు అవగాహన సైతం కల్పించారు. ఇప్పటికే సంఘాల అధ్యక్షులకు ఈ విషయంపై వివరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇచ్చిన విత్తనాలను ప్రభుత్వ బీడు. పోరంబోకు భూముల్లో వీటిని చల్లుకోవాలని సూచిస్తున్నారు. దీంతో పాటు అటు రైతులకు ఇటు గొర్రెల కాపరులకు ఉపయోగకరంగా ఉండే విధానాలను కూడా రూపొందిస్తున్నారు. ఆసక్తిగల గొర్రెల కాపరులు తమ గ్రామాల్లో ఉన్న పండ్ల తోటల యజమానులతో మాట్లాడుకుంటే సదరు తోటల్లో ఉచితంగా గడ్డి జాతుల విత్తనాలను చల్లుకోవచ్చునని పేర్కొంటున్నారు. తద్వారా గొర్రెలకు మేత లభించడంతోపాటుగా.. గొర్రెల ఎరువుతో చేనుకు బలం చేకూరుతుందని యంత్రాంగం పేర్కొంటోంది.

ఉద్యోగాల పేరుతో హైటెక్ మోసం

పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తులు

వరంగల్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): హన్మకొండకు చెందిన ఓ వ్యక్తి కొద్ది రోజుల నుంచి హైదరాబాద్‌లో ఉంటూ అనేక దందాలకు పాల్పడుతున్నాడు. ముఠాను ఏర్పాటు చేసుకొని ఉద్యోగాల పేరుతో మోసాలు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం సుబేదారిలోని తన ఇంటికి వచ్చాడు. వెంట ముఠా సభ్యులను తీసుకొచ్చాడు. రాత్రి సమయంలో రోడ్డుపై కారు పార్కింగ్ చేసి ఉండి.. అందులో తుపాకులు ఉండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి వచ్చారు. పోలీసులను చూసిన ముఠా సభ్యులు పారిపోగా వారిని కొద్ది దూరం వెంబడించారు. ముఠా నాయకుడు అత్యంత ఖరీదైన కారులో వచ్చి వెళ్లిపోయాడు. పోలీసులు ముఠాలో ఉన్న సభ్యుల వివరాలను సేకరించారు. అందులో ఒకరి వద్ద హైదరాబాద్‌లో లైసెన్స్ తీసుకున్న ఆయుధం ఉంది. మరొకరిపై రాష్ట్ర వ్యాప్తంగా 11 కేసులు నమోదయ్యాయి. ఇందులో నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. ఈ పరిణామాలతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఆచూకీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇది.. నగరంలో ముఠా ప్రవేశించినప్పటి నుంచి ఇప్పటి వరకు వారు ఎక్కడెక్కడ తిరిగింది..? ఎవరిని కలిసింది..? ఇక్కడ ఏం చేసేందుకు వచ్చింది..? అనే కోణంలో విచారణ చేస్తోంది. స్వయంగా ఏసీపీ క్షేత్రస్థాయిలో పలువురు సాక్షులను ప్రశ్నిస్తున్నారు. పోలీసులకు ముఠాకు సంబంధించిన కొన్ని ఆధారాలు లభించినట్లు తెలిసింది. దీని ఆధారంగా పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఠాకు నెట్‌వర్క్ ఉన్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికే ముఠా సభ్యులు ఏవైనా ఘటనలకు పాల్పడ్డారా..? బాధితులు ఏవరైనా ఉన్నారా..? భయంతో చెప్పలేకపోతున్నారా...? ఇలా పలు కోణాల్లో విచారిస్తున్నారు.ముఠా సభ్యుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. బ్యాంక్ లావాదేవీలు, ఇతర అంశాలను పరిశీలిస్తున్నారు. ఒకరి ఖాతాలో రూ. లక్షల్లో డబ్బులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అంత పెద్ద మొత్తంలో ఉన్నాయంటే మరేదైనా.. కారణం ఉందా అనే విషయంపై ఆరా తీస్తున్నారు. ముఠాలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉండంతో అక్కడి పోలీసులతోనూ మాట్లాడుతున్నారు. రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని పోలీసులు అంటున్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత సర్పంచ్‌లదే: కలెక్టర్

మెదక్,డిసెంబర్14(నేటినిజం ప్రతినిధి): వచ్చే వర్షాకాలం వరకు హరితహారం మొక్కలను సంరక్షించే బాధ్యత గ్రామ పంచాయతీలు తీసుకోవాలని కలెక్టర్ ధర్మారెడ్డి తెలిపారు. సర్పంచ్‌లు శ్రద్ధ తీసుకుని వీటిని రక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. అప్పుడే నాటిన మొక్కలు బతుకుతాయని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్న విధానాన్ని, మొక్కల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఇదే విధంగా మొక్కలను వచ్చే వర్షాకాలం వరకు కాపాడాలని సూచించారు. మొక్కల పెంపకంతో అడవుల శాతాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఆయన పలు ప్రాంతాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు. అటవీ ప్రాంతమంత కలియదిరుగుతూ అధికారులకు సూచనలను, సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోతుల బారి నుంచి బయటపడాలంటే అడవుల్లో పండ్ల మొక్కలను పెంచాలన్నారు. అడవుల్లో పండ్లు దొరకక కోతులు గ్రామాల్లో సంచరిస్తున్నాయని పండ్ల మొక్కలను పెంచడం వలన అడవులకు తిరుగి వెళ్లిపోతాయి. అలాగే ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని అధికారులకు సూచించారు. నాటిన మొక్కలను కాపాడకపోతే సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలపై చర్యలు తప్పవని వెల్లడించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని కలెక్టర్ ధర్మారెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామస్తులు చెత్తను ఆరుబయట వేయకుండా చెత్త బుట్టలను వాడాలని తెలిపారు.

ఇంగ్లీషులో మాట్లాడడం ఓ ఫ్యాషన్

-తెలుగులో మాట్లాడితే చులకన

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): ఏ భాష మనుగడ సాగించాలన్నా అది పరిపాలనా భాషగా ఉండాలి. తెలుగు మొత్తం సమాజపు భాషగా ఉంటేనే ప్రజలకు కూడా మంచిది. ఇంగ్లీషులో నాలుగు ముక్కలు మాట్లాడితేనే, ఇంగ్లీషు తెలిస్తేనే పనులు జరుగుతాయన్న భావన బలంగా స్థిరపడేలా మన పాలనా యంత్రాంగం నడవడం వల్లనే తెలుగు భ్రష్టు పట్టిపోతోంది. కార్యాలయాలకు వెళ్లి ఇంగ్లీషులో నాలుగు ముక్కలు మాట్లాడడం అన్నది ఫ్యాషన్‌గా మారింది. ఇది బ్రిటీషు పాలకులు మిగిల్చిన అవశేషంగా చూడాలి. నిజానికి మన తెలుగు రాష్ట్రాల్లో తెలుగులో మాట్లాడితే వచ్చే ప్రమాదం లేదు. కొంపలేం అంటుకోవు. అలాగే డిగ్రీ వరకూ తెలుగు పాఠ్యాంశం తప్పనిసరిగా ఉండాలి.అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లోనే ఐదో తరగతి వరకూ మాతృభాషలోనే విద్యాబోధన ఉండాలన్న నిబంధనను పాటించడం లేదు. ఇతరులతో పోల్చుకొనే వీలులేకుండా తెలుగు పిల్లలందరికీ అదే పద్ధతి అవలంబించాలి. అన్ని జిల్లాల్లో భాషా కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల్లో దీనిని ఖచ్చితం చేయాలి. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో తెలుగు భాష అమలుపై, పాఠశాలల్లో మాతృభాషా బోధన తీరుపై పర్యవేక్షణ, నిఘా జరిపేలా చూడాలి. ప్రాథమిక స్థాయిలో తెలుగును విస్మరించి, తరువాత దాని మనుగడ గురించి ఎంత మాట్లాడుకున్నా ఫలితం ఉండదు. అజంత భాషగా, సంగీతాత్మకమైన భాషగా, సుసంపన్న సాహిత్య వారసత్వం కలిగిన భాషగా తెలుగుభాష కీర్తి పొందింది. అనేక పాశ్చాత్య పండితులు తెలుగును ఇటాలి యన్ ఆఫ్ ద ఈస్ట్‌గా కొనియాడారు. తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్యభారతి సుందర తెలుంగు అని కీర్తించారు. మన తెలంగాణ ప్రాచీన కాలం నుంచి విభిన్న పక్రియల్లో తెలుగు సారస్వత సంపదను వెలయించిన సాహితీ సుక్షేత్రం. చరిత్రకు అందినంత వరకు తెలంగాణలో 2000 ఏండ్ల పూర్వం నుంచే తెలుగు భాషా పదాల ప్రయోగం ఉన్నట్టు చారిత్రక ఆధారాలు నిరూపిస్తున్నాయి. అనేక సాహిత్య పక్రియలకు తెలంగాణనే ఆదిగా నిలిచింది. తెలుగుభాషా సాహిత్య ప్రస్థానానికి తెలంగాణనే మార్గదర్శకంగా నిలిచిందన్నది నిర్వివాదాంశం. అలాంటి మధురభాషను కాపాడుకోవడం మన తక్షణ కర్తవ్యం.

చరిత్రను వక్రీకరించిన గ్రంథాలెన్నో

ప్రాణం పోసిన మహామహులెందరో!

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): బ్రిటీషు, ఫ్రెంచ్, చైనా.. తదితర ప్రపంచ దేశాలన్నింటికీ తమకంటూ నిర్దిష్టమైన పద్ధతిలో చరిత్రను నిక్షిప్తం చేసుకున్నారు. కానీ మనదేశచరిత్రను ఎవరు పడితే వారు ఇష్టం వచ్చినట్లుగా చెబుతున్నారు. ఇటీవల చైనా తన చరిత్రను పునర్‌నిర్మించుకుంటోంది. అలా మనమూ చేయాల్సిన అవసరం ఉంది. విదేశీ దండయాత్రల కారణంగా మొత్తం భారతదేశ చరిత్ర, పురాణాలు, ఇతిహాసాలు ధ్వంసం అయ్యాయి. తాళపత్రాలను తగులబెట్టారు. ముస్లిం రాజుల దండయాత్రలో నలందా విశ్వవిద్యాలయంలోని తాళపత్రగంధాలను తగులబెడితే నెలల తరబడి ఆ మంటలు కొనసాగాయంటే అర్థం చేసుకోవచ్చు. తగులబడుతున్న తాళపత్రాలను కొందరు బౌద్ధ సన్యాసులు తీసుకెళ్లి చైనాలో దాచారని అంటున్నారు. అక్కడి భాండాగారాల్లో కొన్నయినా లభ్యం కావచ్చు. మనచరిత్ర అంతా తాళపత్రాల్లోనే నిక్షిప్తంకాగా అవి కాస్తా విదేశీ దాడుల్లో ధ్వంసం అయ్యాయి. అందుకే దేశ చరిత్రతో పాటు, ఆంధ్రుల చరిత్ర, మనభాషా చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు కూడా పోయాయి. 20వ శతాబ్దం ఆరంభంలో ఆలోచనల పరంగా మన దేశం ఆధునిక యుగంలోకి ప్రవేశించింది. ఈ సమయంలోనే మనకెందుకు మన చరిత్ర లేదన్న ఆందోళన కలిగింది. ఈ క్రమంలో తెరమీదకి వచ్చినవారే కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, చిలుకూరు వీరభద్రరావులు శోధించి తెలుగు చరిత్రను నిక్షిప్తం చేసే పననిచేశారు. ఈ పరిశోధకులు తమశక్తిని ధారపోసి తెలుగు చరిత్రను నిర్మించటంలో అవిరళ కృషి చేశారు. తెలుగువారి మూలాలెక్కడన్న ప్రశ్నలకు సాధికారిక సమాధానాలు అన్వేషించారు. నానా కష్టాలు పడి ఒంటి చేత్తో ఆంధ్రుల చరిత్రను చిలుకూరి వీరభద్రరావు మూడు సంపుటాలుగా రాశారు. ఆ తర్వాత వారి దగ్గరే చరిత్ర శోధన అలవరచు కున్న మల్లంపల్లి సోమశేఖరశర్మ తెలుగు చరిత్రకు ఎంతో ఉపకారం చేవారు. కేవలం చరిత్ర నిర్మాణ అభిలాషతో అనేక భాషలు నేర్చుకుని, శాసనాలు సాధికారికంగా చదవటం ఆరంభించి.. ఎవరు ఎక్కడ శాసనం ఉందంటే అక్కడికి వెళ్లి.. ఎన్ని అవస్థలైనా పడి.. దాని ప్రతిని తీసుకొచ్చి.. పరిష్కరించి చరిత్రను అడుగడుగునా నిర్మించిన మహోన్నతుడు ఆయన. బ్రిటీషు వారు 19వ శతాబ్దం ఆరంభంలోనే మన చరిత్రను కొంత క్రోడీకరించటం మొదలుపెట్టారు. దక్షిణ భారతదేశానికి సర్వేయర్ జనరల్‌గా వచ్చిన కల్నల్ మెకంజీ ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలను చక్కగా వివరించే గ్రంథాలను రాయాలన్న తలంపుతో ఎంతోమంది గుమాస్తాలనూ ఏర్పాటు చేసుకున్నాడు. వాళ్లను గ్రామగ్రామానికీ పంపించి తామ్ర, శిలా శాసనాలు, తాళపత్రాల వంటివన్నీ సేకరించి క్రోఢీకృతులన్ సిద్ధం చేశాడు. ఇలా తయారైన నాలుగు వందల సంపుటాలు నేటికీ మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలో ఉన్నాయి.. ఇప్పటికీ ఇవి మనకు చక్కటి చారిత్రక వనరులుగా ఉపయోగ పడుతూనే ఉన్నాయి. ఆయన సిబ్బందికి నాయకత్వం వహించిన కావలి వెంకట బొర్రయ్య.. ఆ తర్వాతా బోలెడంత చరిత్ర శోధన చేశారు. తెలుగు నేలను పాలించిన వేములవాడ చాళుక్యులు, కాకతీయులు, రాష్ట్రకూటులు, పల్లవుల వంటి ఎన్నో రాజవంశాల చరిత్రలను నేలటూరి వెంకటశేషయ్య వెలికి తీసారు. వేటూరు ప్రభాకరశాస్త్రి, కుందూరు ఈశ్వరదత్తు, భావరాజు వెంకటకృష్ణరావు పంతులు, రాళ్లబండి సుబ్బారావు, డాక్టర్ మారేమండ రామారావు వంటి వారు తరవాతి కాలంలో తెలుగు చరిత్రకు సాధ్యమైనంత సమగ్రత తీసుకువచ్చారు. అందుబాటులో ఉన్న శాసనాలు, నాణెళిలు, సాహిత్యం.. వంటివన్నీ సేకరించి, శోధించి చరిత్ర నిర్మాణం చెయ్యటం వల్ల మనకూ ఘనమైన చరిత్ర ఉందన్న విషయం తెలిసింది. దీనిని మరింతగా పరిశోధించి పరిష్కరించుకోగలిగితే తెలుగునేలకు మేలు చేసిన వారం అవుతాం. అందుకు ప్రభుత్వాల పరంగా కార్యాచరణ జరగాలి.

వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించాల్సిందే

లక్ష్యా

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళా తీసింది

- సీఎం కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలే అందుకు కారణం
- తెలంగాణ మరో వెనిజులాగా మారుతుందేమో అని భయమేస్తోంది
- నమస్తే పెడితే కార్పొరేషన్.. కాళ్లు మొక్కితే కేబినెట్ ర్యాంకు పదవులు
- పల్లా కార్పొరేట్ కళాశాలల్లో వ్యవసాయం చేస్తున్నారా?
- తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారు
- విలేకరుల సమావేశంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : కేసీఆర్ రెండోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తెలంగాణ పాలన అస్తవ్యస్తంగా మారిం దని, రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాళా తీసిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో భట్టి విలేకరులతో మాట్లాడారు.. కేసీఆర్ రెండోసారి అధికారం చేపట్టిన ఏడాదిలోనే తెలంగాణలో అల్లకల్లోలం నెలకొందని విమర్శి ంచారు. సంవత్సర కాలంలో కేసీఆర్ పాలనలో.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందని అందుకు కేసీఆర్ ఏకపక్ష విధానాలే కారణమని భట్టి ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగాయని, శాంతి భద్రతలు నశించాయని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వా మ్యం అపహాస్యమైందని అన్నారు. కేసీఆర్‌కు నమస్తే పెడితే కార్పొరేషన్ పదవులు, కాళ్లు మొక్కితే క్యాబినెట్ ర్యాంకు పదవులు వరిస్తాయని ఎద్దేవా చేశారు. వ్యవసాయ ంపై ఏమాత్రం పట్టులేని పల్లా రాజేశ్వర్ రెడ్డికి.. ఎందుకు రైతు సమన్వయ చైర్మన్ పదవి ఇచ్చారని ప్రశ్నించారు. పల్లా కార్పొరేట్ కళాశాలల్లో వ్యవసాయం చేస్తున్నారా అంటూ భట్టి ఎద్దేవా చేశారు. ఏకపక్ష పోకడతో రాష్ట్రం మరో వెనిజులాగా మారుతుందేమో అనే భయం కలుగుతో ందన్నారు. సామాన్యులను పట్టించుకునే పరిస్థితిలో పోలీసుశాఖ లేదని అభిప్రాయపడ్డారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి, కేవలం మంత్రులు, నాయకుల కోసమే పనిచేసేలా నియంత్రించారని విమర్శించారు. రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో రెవెన్యూ శాఖలో తీవ్ర గందరగోళం నెలకొందని భట్టి విక్రమార్క తప్పుంటూరు. దళితులకు మూడెకరాల భూమిని పంపిణీ చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. సగానికి పైగా రైతులకు రైతుబంధు అందని దుస్థితి ఏర్పడిందన్నారు. ఆర్టీసీ సమ్మెపై కేసీఆర్ గందరగోళ ప్రకటనతో 30 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా రని మండిపడ్డారు. ఉద్యోగాల భర్తీ కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగ భృతి ఊసేలేదని మండిపడ్డారు. ప్రభుత్వం అసమర్థత కారణంగా చివరకు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వచ్చిందని హేళన చేశారు. నిర్మాణంలో ఉన్న ఆన్-గోయింగ్ ప్రాజెక్టులను పక్కన పెట్టి .. రీ డిజైన్ పేరుతో అడ్డగోలు దోపిడీకి తెరతీశారని అన్నారు. రాష్ట్రంలో విచ్చలవి డిగా బెల్ట్ షాపులు ఏర్పడి, అడ్డగోలుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని భట్టి అన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రం జ్వరాలమయం అ యినా.. ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా రాజకీయ ఫిరాయింపులు పెరిగిపోయాయని.. స్వయం గా సీఎం ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని భట్టి ఆరోపణలు చేశారు.

పౌల్ట్రీ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

సిఎం కెసిఆర్ లక్ష్యం కూడా ఇదే
మరిన్నిరాయితీలతో ఆదుకుంటాం
మంత్రివర్గ ఉపసంగం భేటీలో తలసాని శ్రీనివాసయాదవ్

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): పౌల్ట్రీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధక ,మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో పౌల్ట్రీ రంగ అభివృద్ధిపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం 2 వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఈటెల రాజేందర్, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశానికి పౌల్ట్రీ రంగ ప్రతినిధులు, పెరటికోళ్ల పెంపకం దారులను ఆహ్వానించి వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ లక్షలాది మంది ఆధారపడి ఉన్న ఈ రంగాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కృతనిశ్చయంతో ఉన్నారని, అందులో భాగంగానే మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నో కష్టాలలో ఉన్న పరిశ్రమ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం అమలు చేసిన యూనిట్ విద్యుత్ పై 2 రూపాయల సబ్సిడీ, కోళ్ళ దాణా కు అవసరమైన మొక్కజొన్నలను సరఫరా చేయడం వంటి కార్యక్రమాలతో పౌల్ట్రిరంగం అభివృద్ధిలోకి వచ్చిందని పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పెరటి కోళ్ళ పెంపకం క్రింద ప్రభుత్వం అందజేసిన కోళ్ళ పెంపకంతో తాము మాంసం, గ్రుడ్ల విక్రయాలతో ఉపాధి పొందుతున్నామని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను త్వరలోనే అధ్యయనం చేయడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజులలో ఈ రంగానికి మరింత లబ్దిచేకూర్చే విధంగా దేశంలోనే ఉత్తమ పాలసీని రూపొందించి ముఖ్యమంత్రికి నివేదిక అందజేస్తామని చెప్పారు. పౌల్ట్రిరంగ అభివృద్ధి, ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం 3 వ స్థానంలో ఉందని చెప్పారు. కోళ్ళు వ్యాధుల భారిన పడకుండా వ్యాధుల నిర్ధారణకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అధునాతన లాబరేటరీని ఏర్పాటు అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా దాణా నాణ్యతను పరిశీలించేందుకు మరొక అధునాతన లాబరేటరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం గురించి చర్చించారు. విద్యుత్ సబ్సిడీ కోసం సంవత్సరానికి 20 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఇస్తుందని మంత్రి శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మెరుగైన టారిఫ్ కోసం విద్యుత్ అధికారులను ఈ నెల 30 వ తేదీన జరిగే 3 వ సమావేశానికి ఆహ్వానిస్తామని తెలిపారు. రాష్ట్రంలో లేయర్ కోళ్ళు, బాయిలర్ కోళ్ళ పెంపకం దారులు ఎంతవంది ఉన్నారు, దాణా ఉత్పత్తిదారులు ఎంతమంది ఉన్నారు సమగ్ర సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కోళ్ళ పరిశ్రమకు మొక్కజొన్న ఎంతమేరకు అవసరం ఉంటుందో గుర్తించాలని అన్నారు. పౌల్ట్రీ మార్కెట్‌లో పౌల్ట్రీ రంగం నిలదోక్కుకునే విధంగా ప్రభుత్వం ఏ విధమైన సహాయ సహకారాలు అందించగలదో పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడం జరుగుతుందని అన్నారు. మన రాష్ట్ర పౌల్ట్రీ ఉత్పత్తులను ఇతర దేశాలు, రాష్ట్రాలకు ఎగుమతులు మరింత పెంచేందుకు మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉందన్నారు. పెరటికోళ్ల యూనిట్లను ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికి అందించాలని అన్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, వెటర్నరీ యునివర్సిటీ డీన్ వీరోజిరావు, నాబార్డ్ టణప రమేష్, మార్క్‌ఫెడ్ విష్ణువర్ధన్, ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్, పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు ప్రదీప్ రావు, రాంరెడ్డి, చక్రధరరావు, మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, రవీందర్ బాబు, కోటయ్య పాల్గొన్నారు.

ఆర్థిక చర్యలతో సత్ఫలితాలు

సంస్థల సమస్యలను పరిష్కరిస్తాం
కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): ఆర్థిక అంశాలపై ప్రభుత్వం కసరత్తు సాగిస్తోందని, పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. దివాలా చట్టంపై ప్రభుత్వం సత్వరం స్పందించిందని ఆమె చెప్పుకొచ్చారు. ప్రభుత్వం గత కొద్దినెలలుగా ప్రకటించిన చర్యలతో ఫలితాలు ఇవ్వడం మొదలైందని తెలిపారు. కార్పొరేట్ ట్యాక్సుల తగ్గింపు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన సమీకరణ, నిలిచిపోయిన నిర్మాణ ప్రాజెక్టులకు ఊతం వంటి పలు చర్యలను ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. సోమవారం నుంచి బ్జడెట్ ముందస్తు సంప్రదింపులు ప్రారంభమవు తాయని వెల్లడించారు. ఇక ఆర్థిక ఉదార విధానాలను కొనసాగిస్తుండటంతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో రికార్డుస్థాయిలో దేశంలోకి వచ్చాయని ప్రధాన ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్ పేర్కొన్నారు. ప్రాధాన్యేతర రంగాల్లో పెట్టుబడుల ఉపసంహరణను ప్రభుత్వం వేగవంతం చేసిందని చెప్పారు. ఆర్థిక వృద్ధిని పెంపొందించేందుకు వినియోగం పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. రిటైల్ రుణాల జారీ కోసం ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలకు రూ 4.47 లక్షల కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు కార్పొరేట్లకు రూ 2.2 లక్షల కోట్లు, చిన్నమధ్యతరహా కంపెనీలకు రూ 72985 కోట్ల రుణాలను మంజూరు చేశాయని చెప్పారు. ఇక ఇప్పటివరకూ రూ 1.57 లక్షల కోట్ల ఐటీ రిఫండ్‌లను ఆదాయ పన్ను శాఖ జారీ చేసిందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 27.2 శాతం అధికమని రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే వెల్లడించారు.

రాహుల్ వ్యాఖ్యలు గర్హనీయం

లైంగిక దాడులపై మేకిన్ ఇండియాను ఉటంకిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. రాహుల్ వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆందోళన వ్యక్తం చేశారు. తాము మహిళల గౌరవం గురించి మాట్లాడుతుంటే రాహుల్ చౌకబారు వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. కాగా ప్రధాని నరేంద్ర మోదీ తరచూ మేకిన్ ఇండియా గురించి చెబుతుంటారని అయితే దేశంలో పరిస్థితి మాత్రం రేపిన్ ఇండియాగా మారిందని జార్ఖండ్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు పెనుదుమారం రేపాయి. రాహుల్ తక్షణమే క్షమాపణ చెప్పాలని పార్లమెంట్‌లో పాలక పక్ష సభ్యులు డిమాండ్ చేయగా క్షమాపణ చెప్పేది లేదని రాహుల్ స్పష్టం చేశారు.

రాజ్యసభకు కవితను పంపే ఆలోచన?

కేశవరావు రిటైర్ కాగానే తగు నిర్ణయం
ఎగువ సభలో పార్టీ వాణిని గట్టిగా వినిపించాలన్న లక్ష్యం

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితను త్వరలో జరిగే ద్వైపాక్షిక రాజ్యసభ ఎన్నికల్లో పెద్దలసభకు పంపాలని సిఎం కెసిఆర్ నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తన సన్నిహితుల వద్ద ఈ విషయాన్ని చూచాయగా ప్రస్తావించారని సమాచారం. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె నిజామాబాద్ బిజెపి అభ్యర్థి ధర్మపురి అర్వింద్ చేతిలో ఓటమి పాయ్యారు. వచ్చే ఏడాది టిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కె. కేశవవరావు పదవీకాలం ముగుస్తుందని భావిస్తున్నారు.

ఆ సీటులో కవితకు ఛాన్స్ ఇవ్వడం ద్వారా ఆమెను ఎగువసభకు ఎంపికచేయాలన్న ఆలోచనలో కెసిఆర్ ఉన్నట్లు పార్టీలో కూడా ప్రచారం సాగుతోంది. కెకెను మరోమారు రాజ్యసభకు పంపే ఆలోచన లేదని తెలుస్తోంది. అలాగే ఒకరికి ఒకసారే అన్న రీతిలో కెసిఆర్ ఉన్నట్లు కూడా ప్రచారం సాగుతోంది. ఆమెను పెద్దల సభకు పంపి పార్టీ వాణిని గట్టిగా వినిపించాలని కెసిఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఓటమి పాలైన తర్వాత కొంత కాలం సైలెంట్‌గా వున్న కవిత తాజాగా జాతీయ అంశాలపై పెదవి విప్పుతున్నారు. జిడిపి గణనీయంగా తగ్గిన నేపథ్యంలో దేశ ఆర్థిక పరిస్థితిపై కవిత కొన్ని వివరాలతో ట్వీట్లు సంధించారు. తాజాగా ఈశాన్య భారతంలో రగులుతున్న ఆందోళనను ముందుగానే ప్రెడిక్ట్ చేసిన కవిత సిటిజన్‌షిప్ బిల్లులో లోపాలను ఎత్తిచూపారు. అదే సమయంలో తెలంగాణకు రావాల్సిన నిధులను విడుదల చేయడంతో మోదీ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని కవిత ఎత్తి చూపారు. ఇలా జాతీయ అంశాలపై సమగ్ర అవగాహన కలిగి వున్న కవితను రాజ్యసభకు పంపాలన్న ఒత్తిడి గులాబీ దళపతిపై పెరుగుతున్నట్లు సమాచారం. దాంతో కవిత పేరుతోపాటు తనకు బంధువైన కరీంనగర్ మాజీ ఎంపీ, ప్రస్తుతం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ పేరును కూడా కేసీఆర్ పరిశీలించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, వినోద్‌కు కేబినెట్ హోదా కలిగిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి ఇచ్చినందున తాజాగా రాజ్యసభ అభ్యర్థుల పరిశీలనలో ఆయన పేరును పక్కన పెట్టారని, దాంతో కవితకు లైన్ క్లియర్ అయ్యిందని తెలుస్తోంది. తెలంగాణ ప్రయోజనాలపై ఉభయ పార్లమెంటు సభల్లో గట్టిగా వాయిస్ వినిపించే నేత అవసరమని భావిస్తున్న కేసీఆర్, అందుకు కవితనే తగిన అభ్యర్థని అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఇందుకు ఇటీవల కాలంలో కవిత ప్రస్తావిస్తున్న అంశాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. 2019 మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి రెండోసారి పోటీ చేసిన కవిత అనూహ్యంగా బిజెపి అభ్యర్థి అరవింద్ చేతిలో ఓటమి పాలయ్యారు. కవిత ఓటమిని ఆమె ఒక్కరే కాదు.. టిఆర్ఎస్ శ్రేణులు, ఆమె అభిమానులు నేటికీ జీర్ణించుకోలేకపోతున్నారు.

మద్యం పునాదులపైనే డికె అరుణ కుటుంబం

మద్యం వ్యాపారంతో జిల్లాలో ఏరులై పారించారు
నేటికీ వారికి మద్యం దుకాణాలు ఉన్నాయి
మద్యం వ్యాపారులే మద్య నిషేధం గురించి మాట్లాడడమా?
డికె అరుణ దీక్షపై మండిపడ్డ గద్వాల ఎమ్మెల్యే

గద్వాల,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): మాజీ ఎమ్మెల్యే డీకే అరుణ ఇంటి పునాదులే మద్యంపై నిలిచాయని, అలాంటిది ఆమె మద్యం బంద్ చేయాలని దీక్ష చేయడం విడ్డూరంగా ఉందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మద్యపానం అమలు వల్ల మహిళలపై అఘాత్యాలు పెరిగిపోతున్నాయని వెంటనే మద్యాన్ని బంద్‌చేయాలని హైదరాబాద్‌లో అరుణ దీక్ష చేస్తుంటే ప్రజలు నవ్వుకోవడంతో పాటు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎమ్మెల్యే బండ్ల ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడారు. డికె భర్త సారా కంట్రాక్టర్‌గా అందరికీ చిరపరిచితమేనని అన్నారు.

డీకే కుటుంబం గద్వాలను సుమారు 40 ఏండ్లు పాలించిన కాలంలోనే నియోజకవర్గంలో మద్యం ఏరులై పారిందని గుర్తుచేశారు. వారి పాలనలోనే గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు వెలిశాయని, అప్పుడు మంచినీరు లభించని గ్రామాల్లో కూడా మద్యం దొరికేదని ఆయన స్పష్టం చేశారు. అరుణ పదవిలో ఉన్న సమయంలో జిల్లా కేంద్రంలో వారి అనుచరులవే 40 దాక దాబాలు ఉండేవని, వీటికి ఆమె భర్త భరత్‌సింహారెడ్డి వైన్ షాపుల ద్వారా మద్యం సరఫరా చేసి గద్వాల నియోజకవర్గంలో ఎంతో మంది మహిళల తాళిబొట్లు తెగిపోవడానికి వారు కారణమయ్యారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో దాబాలు బంద్ చేయించడంతో పాటు బెల్ట్ దుకాణాలు అరికట్టామని స్పష్టం చేశారు. ఈ మద్య జరిగిన మద్యం టెండర్లలో మాజీ ఎమ్మెల్యే భర్తతో పాటు ఆయన అనుచరులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 15 నుంచి 25 వరకు మద్యం దుకాణాలు దక్కించుకున్నారని తెలిపారు. డికె అరుణ మద్యం బంద్‌పై దీక్ష చేసేటప్పుడు మొదట తన భర్తకు వచ్చిన మద్యం దుకాణాలు బంద్ చేసి తరువాత మద్యం బంద్‌పై ఆందోళన చేస్తే బాగుండేదన్నారు. డీకే అరుణ కుటుంబం జీవితం ప్రారంభమైందే మద్యం ద్వారా అని ఈ విషయం మరచి ఆమె దీక్ష చేయడం విడ్డూరమన్నారు. మద్యపాన నిషేధంపై మాట్లాడే అర్హత డీకే అరుణకు లేదని అన్నారు. తమ ఉనికిని కాపాడుకోవడానికి, పత్రికలు, టీవీల్లో పేరుకోసం దీక్ష చేస్తున్నారే తప్ప మహిళలపై గౌవరంతో కాదన్నారు. నిజంగా మహిళా లోకంపై ఆమెకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా తన ఇంటి నుంచే మద్యపాన నిషేధం ప్రారంభించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏమి పనిలేక, పనిగట్టుకుని ప్రభుత్వాన్ని బదనామ్ చేయడానికే డీకే అరుణ ఈ దీక్ష చేస్తుందని ఆయన మండిపడ్డారు. గతంలో ఓ టీవీ ఛానల్‌కు ఇంటర్వూ ఇస్తూ తమకు మద్యం దుకాణాలు ఉన్నాయని, మద్యం అమ్మితే తప్పేమని ఆమె చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుని ఈ దీక్ష చేస్తే బాగుండేందని ఆయన అన్నారు. సమావేశంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ రాజశేఖర్, రైతుసమన్వయ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, కేశవ్, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు త్వరలో శుభవార్త

పసుపుబోర్డును మించిన ప్రయోజనాల కోసం అడుగులు
నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్

న్యూఢిల్లీ,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): పసుపు రైతులకు జనవరిలో శుభవార్త వినిపిస్తామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. పసుపు బోర్డును మించిన ప్రయోజనాలు కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. ఆయన శుక్రవారమిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. 'అరవింద్ గట్టి నెగోషియేటర్ అన్న విషయం నిరూపిస్తాను. పసుపు దిగుమతి నిలిపేయాలని కోరాం. ఇందుకు కేంద్రం సానుకూలంగా ఉంది. పసుపు జాతీయ స్థాయిలో సాగు చేసే పంటకాదు. అయినా సరే పసుపు పంటకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అయితే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రావాలి.

ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం పసుపు మద్దతు ధరపై ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు. కాగా పసుపు రైతుల కష్టాలు, మద్దతు ధరపై ఎంపీ అరవింద్ ఇవాళ కేంద్రమంత్రులు అమిత్ షా, పియూష్ గోయల్‌ను కలిశారు. విదేశాల నుంచి పసుపు దిగుమతి నిలిపివేయాలని రైతులను ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా కేంద్రమంత్రులను కోరారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రానికి ప్రతిష్టాత్మక ఐఐఎం, ఐఐఎస్‌ఈఆర్ కేటాయించాలని హెచ్ఆర్డీ మంత్రిని కోరాం. అందుకు మంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. పార్లమెంట్ సమావేశాల చివరి రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశాం. తెలంగాణ బీజేపీదే అని ప్రధాని అన్నారు. తదుపరి తెలంగాణలో ఏర్పడేది బీజేపీ సర్కారే అని కేంద్ర నాయకత్వం నమ్ముతోంది. క్షేత్రస్థాయిలో సమాచారం లేకుండా మోదీ ఏదీ మాట్లాడరు. తెలంగాణలో ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు.' అని అన్నారు.

మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసిన పుదుచ్చేరి మంత్రి

హైదరాబాద్, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : నగరానికి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పుదుచ్చేరి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇరు రాష్ట్రాల విద్యుత్ పై మాట్లాడుకున్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మంత్రి జగదీశ్‌రెడ్డి ఆయనకు వివరించారు. ఈసందర్భంగా శాసన సభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీం ద్ర నాయక్, భాస్కరరావు, చిరుమర్తిలింగయ్యతోపాటు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మాజీ శాసన సభ్యులు కేసుకుంట్ల శ్రీధర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు కూడా ఈ సమావేశంలో ఉన్నారు.

జమ్మూకశ్మీర్ జైళ్లలో మైనర్లు లేరు

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : జమ్మూకశ్మీర్ జైళ్లలో మైనర్లు లేరని సుప్రీంకోర్టు తెలిపింది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్‌కు చెందిన కొంతమంది మైనర్లను అదుపులోకి తీసుకొని జైళ్లలో పెట్టారని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. దీనిపై జమ్మూకశ్మీర్ హైకోర్టు జువినైల్ జస్టిస్ కమిటీ సమర్పించిన నివేదికను పరిశీలించిన న్యాయస్థానం సంతృప్తి వ్యక్తం చేసింది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో మైనర్లను అదుపులోకి తీసుకున్నారంటూ ఇనాక్షీ గంగూలీ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ కమిటీని ఏర్పాటు చేసింది. శుక్రవారం కమిటీ సమర్పించిన నివేదికను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ నేతృత్వంలోని ధర్మాసనం సరైందేనంటూ స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్‌లోని అన్ని జైళ్లను కమిటీ సందర్శించిందని.. ఏ జైలులో కూడా మైనర్లు లేరని కమిటీ నివేదికలో తెలిపిందంటూ ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ కమిటీ సమర్పించిన నివేదికపై స్పందించేందుకు పిటిషనర్‌కు కొంత సమయం ఇవ్వాలంటూ కోరారు. జమ్మూ కాశ్మీర్‌లో మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నట్లయితే సంబంధిత ఫోరంను సంప్రదించేందుకు పిటిషనర్లకు ధర్మాసనం పూర్తి స్వేచ్ఛనిచ్చింది.

పౌరసత్వ బిల్లుపై సుప్రీంను ఆశ్రయించిన తృణమూల్

న్యూఢిల్లీ,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ నేత, లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే పార్లమెంటు ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాత్రి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కాగా తమ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలంటూ మెయిత్రా తరపు న్యాయవాది సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డేని అభ్యర్థించారు. అయితే దీనిపై మెన్షనింగ్ అధికారిని సంప్రదించాలంటూ జస్టిస్ బాబ్డే సూచించారు. వెంటనే లేదా సోమవారం దీనిపై విచారణ చేపట్టాలంటూ మొయిత్రా ధర్మాసనానికి విన్నవించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గురువారం రాత్రి పౌరసత్వ సవరణ బిల్లు 2019కి ఆమోదం తెలపడంతో.. ఈ బిల్లు చట్టం రూపు దాల్చింది. ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబర్ 31లోపు పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో మత పీడనకు గురై... భారత్ వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు భారత పౌరసత్వం లభిస్తుంది.

అక్బర్ బెయిల్ రద్దుచేయాలి

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ):శాసన సభలో మజ్లిస్‌పార్టీ పక్షం నేత అక్బరుద్దీన్ ఓవైసీకి ఇచ్చిన బెయిల్‌ను రద్దుచేయాలని హిందూ సంఘటన్ అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. 2012లో నిజామాబాద్‌లో జరిగిన ఓ సభలో ఆయన చేసిన వివాదాస్పద వాఖ్యలపై ఇప్పటికే బెయిల్ పొందారు. పదే పదే అక్బరుద్దీన్ వివాదాస్పద వ్యాఖ్యలుచేస్తున్నారంటూ పిటిషనర్ కోర్టుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అక్బరుద్దీన్, సిఐడీక

పక్కదారి పడుతున్న తెలంగాణ గొర్రెల యూనిట్లు

గ్రామాల్లో ప్రజల ఆందోళన
పంపిణీ పథకం దుర్వినియోగంపై నిఘా

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): మాంసం ఎగుమతుల్లో తెలంగాణ ముందుండాలని, గొర్ల కాపరులు ఆర్థికంగా ఎదిగి రారాజులు కావాలన్న సంకల్పంతో సిఎం కెసిఆర్ ప్రవేశ పెట్టిన గొర్రెల పంపిణీ పథకం దుర్వినియోగం అయ్యిందనే విమర్శలే ఎక్కువ. మాంసం ఎగుమతుల సంగతెలా ఉన్నా గొర్రెల యూనిట్లు ఉన్నాయా అన్న సందేహం కలుగుతోంది. సబ్సిడీ గొర్రెలను అందుకున్న వారు ఎక్కడికక్కడే అమ్ము కున్నారని గ్రామాల్లో ప్రచారం సాగుతోంది. అక్కడక్కడా వచ్చి కొన్ని ఆరోపణలపై గొర్రెల సంరక్షణపై నిఘాను కట్టుదిట్టం చేస్తున్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి తనిఖీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని అమ్ముకుంటే చర్యలు తీసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. గొర్లకాపర్ల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల యూనిట్ల పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తోందన్నారు. పలు చోట్ల గొర్రెల యూనిట్లను అమ్ముకుంటున్నారనే సమాచారంతో యంత్రాంగం అప్రమత్తమైంది. గొర్రెల యూనిట్లు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఆయా మండలాల్లోని ఎంపీడీఓలు, తహసీల్దార్‌లకు బాధ్యతలు అప్పగించారు. వీరు ప్రతీ 15 రోజులకు ఒకసారి ఆయా గ్రామాల్లో అందజేసిన గొర్రెల యూనిట్ల పరిస్థితిని తెలుసుకోవడం ద్వారా నిరంతర నిఘా పెట్టనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గొర్రెల సహకార సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా దుర్వినియోగం జరిగితే రెవెన్యూ రికవరీ యాక్టు కింద వడ్డీతో కలిపి సబ్సిడీ సొమ్మును వసూలు చేస్తామని హెచ్చరికలు సైతం జారీ చేశారు. అంతేకుండా సదరు సంఘాలను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని.. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. సబ్సిడీ కింద వచ్చిన గొర్రెల అమ్మకం.. కొనుగోలు నేరమని పేర్కొంటున్నారు. మొత్తంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేస్తున్నారు. గొర్ల కాపర్లలో అవగాహన పెంచుతోంది. అలాగే సబ్సిడీపై గడ్డివిత్తనాలు ఇచ్చేందుకు కార్యచరణ సిద్ధం చేశారు. గొర్రెలకు సంపూర్ణ రక్షణగొర్రెల యూనిట్ల లబ్ధిదారులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూనిట్ సొమ్ములో ఇన్సూరెన్స్ కూడా తోడై ఉంది. దీంతో ఏ ఒక్క గొర్రె చనిపోయినా దాని స్థానంలో మరో గొర్రెను అందించనున్నారు. అయితే ఈ వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు నివేదించాల్సి ఉంటుంది.

అంతేకాకుండా గొర్రెల కాపరులకు కూడా ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. ఎవరైనా గొర్ల కాపరులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ లక్ష ఇన్సూరెన్స్ సొమ్ము రానుంది. ఇదిలా ఉంటే గొర్రెల సంరక్షణ కోసం పశు వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. లబ్ధిదారుల వద్దకు చేరుకోగానే వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా టీకాలు వేస్తున్నారు. అనారోగ్యానికి గురైన వారికి చికిత్సలు చేసి లబ్ధిదారులకు అండగా నిలుస్తున్నారు. గొర్రెల మేతకు అవసరమైన గడ్డి విత్తనాలను 100శాతం ఉచితంగా అందించేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంపై ఇదివరకే గొర్రెల కాపరులకు అవగాహన సైతం కల్పించారు. ఇప్పటికే సంఘాల అధ్యక్షులకు ఈ విషయంపై వివరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇచ్చిన విత్తనాలను ప్రభుత్వ బీడు. పోరంబోకు భూముల్లో వీటిని చల్లుకోవాలని సూచిస్తున్నారు. దీంతో పాటు అటు రైతులకు ఇటు గొర్రెల కాపరులకు ఉపయోగకరంగా ఉండే విధానాలను కూడా రూపొందిస్తున్నారు. ఆసక్తిగల గొర్రెల కాపరులు తమ గ్రామాల్లో ఉన్న పండ్ల తోటల యజమానులతో మాట్లాడుకుంటే సదరు తోటల్లో ఉచితంగా గడ్డి జాతుల విత్తనాలను చల్లుకోవచ్చునని పేర్కొంటున్నారు. తద్వారా గొర్రెలకు మేత లభించడంతోపాటుగా.. గొర్రెల ఎరువుతో చేనుకు బలం చేకూరుతుందని యంత్రాంగం పేర్కొంటోంది.

కేసీఆర్ పథకాలు ఆదర్శం: ఎమ్మెల్యే

నిర్మల్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): ఆర్థికమాంద్యం ఉన్నా ఐదేళ్లలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించిన ఘనత సిఎం కేసీఆర్‌కే దక్కిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. జిల్లాలో సింగరేణి వెలుగునిచ్చే పరిశ్రమ అని, డీఎంఎఫ్ నిధులతో జిల్లాను అభివృద్ధి చేస్తామని తెలిపారు. జిల్లా అంతా గిరిజన ప్రాంతం కావడం వల్ల పట్టణ ప్రాంతాల్లో 1/70 సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. జిల్లా అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు వెళ్తానని చెప్పారు. ప్రతీ గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పట్టణ ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయేలా ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ప్రజల్లో చిరస్థాయిగా ఉండేలా ప్రజా సేవలకు అంకితమయ్యాన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు దేశంలో ఎక్కడా లేవని, దేశం అంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు.

అమెరికా, బ్రిటన్‌లను తాకిన.. 'పౌరసత్వ' సెగ!

ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లేవారు జాగ్రత్త వహించాలి
– ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసిన యూకే, యూఎస్

న్యూఢిల్లీ, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా భారత్‌లోని కొన్నిప్రాంతాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలైన అసోం, త్రిపురల్లో హింసాత్మక నిరసనలు చోటుచేసుకుంటున్నాయి. గువాహటిలో కర్ఫ్యూ విధించారు. అసోంలోని కొన్ని జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. రవాణాకు కూడా అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే దిల్లీ, బెంగాల్‌లోనూ నిరసనలు జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా.. ఆందోళనల నేపథ్యంలో భారత్‌కు వచ్చే తమ పౌరులకు తాజాగా ట్రావెల్ అడ్వైజరీ జారీ చేశాయి అమెరికా, బ్రిటన్ దేశాలు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లేవారు అత్యంత జాగ్రత్త వహించాలని సూచించాయి. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని యూకే తమ ట్రావెల్ అడ్వైజరీలో పేర్కొంది.

తమ అధికారుల అసోం పర్యటనలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అమెరికా వెల్లడించింది. ఈశాన్య రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆందోళనల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. మేఘాల య, అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనను రద్దు చేసుకున్నారు. అటు జపాన్ ప్రధాని షింజో అబే భారత పర్యటన కూడా రద్దయింది.

గువహటిలో తాత్కాలికంగా కర్ఫ్యూ సడలింపు..

అసోంలోని గువహటిలో విధించిన కర్ఫ్యూను శనివారం తాత్కాలికంగా సడలించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కర్ఫ్యూ ఎత్తివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పౌరసత్వ చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన కారణంగా అసోంలో నిరసనల వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసు అధికారులు అక్కడ నిరసనలు అరికట్టేందుకు కర్ఫ్యూ విధించారు. సీఆర్పీఎఫ్ భద్రతా బలగాలను అక్కడ మోహరించారు. గురువారం చేపట్టిన నిరసనల్లో ఇద్దరు పౌరులు మరణించారు. భారత ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన పౌరసత్వ చట్ట సవరణ బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఈ బిల్లు ద్వారా పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు భారత పౌరసత్వం లభించనుంది.

జిల్లాస్థాయిలో పోటీ పరీక్షలు

కామారెడ్డి,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్షల పోస్టర్లను జేసీ యాదిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు, గణితంలో మంచి మార్కులు సాధించేందుకు ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రామానుజన్ జయంతి సందర్భంగా జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 22న కరీంనగర్‌లో పరీక్షను నిర్వహించనున్నట్లు చెప్పారు

రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టేలా వైకాపా వ్యవహరిస్తుంది

– ప్రత్యేక హోదాను పక్కన పెట్టారు
– పోలవరానికి నిధులివ్వాలని పార్లమెంట్‌లో కోరాం
– వైకాపా ఎంపీలు రాష్ట్ర అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తలేదు
– తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్

న్యూఢిల్లీ, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేలా వ్యవహరిస్తుందని, తమ కేసుల నుంచి బయటపడేందుకు ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని అడిగేందుకు జగన్మోహన్‌రెడ్డి, ఎంపీలు కనీస ప్రయత్నం చేయడం లేదని తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. శనివారం ఢిల్లీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టేలా వైకాపా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఉభయ సభల్లో వైకాపా ఎంపీలు రాష్ట్ర సమస్యలు లేవనెత్తలేదని అన్నారు. ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. తెదేపా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సమస్యలను కేంద్ర మంత్రులను కలిసి వివరించామని అన్నారు. ఆరు నెలల్లో జగన్ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన సంస్థలు వెనక్కి వెళ్లిపోతున్నాయని రవీంద్ర అన్నారు. పార్లమెంట్‌లోనూ, అసెంబ్లీలోను ఆర్థిక నేరాల ప్రస్తావన లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో అసెంబ్లీ సమావేశాలు జరగడం లేదని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని పార్లమెంట్‌లో కేంద్రాన్ని కోరామని, వైకాపా ఎంపీలు మాత్రం రాష్ట్ర అంశాలను పార్లమెంటులో లేవనెత్తలేదని విమర్శించారు.

అమరావతిని రాష్ట్ర రాజధానిగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, 22 మంది లోక్ సభ సభ్యులు పార్లమెంట్ లో రాష్ట్ర పరిస్థితులు కేంద్రం దృష్టికి తేలేదన్నారు. జగన్ తమ 24మంది ఎంపీలను ప్రధాని వద్దకు పంపి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించాలని కనకమేడల డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్, విజయసాయిరెడ్డి ఇతర అధికారులు ఆర్థిక నేరస్తులుగా ఉన్న కేసుల్లో.. ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లభించడం లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టేందుకు ముఖ్యమంత్రి, పార్లమెంటరీ పక్ష నేతలపై ఉన్న కేసులే కారణమని కనకమేడల ఆరోపించారు. తాము అవినీతి రహిత వ్యక్తులమని జగన్, విజయసాయిరెడ్డి నిరూపించుకోవాలన్నారు. దిశ చట్టం మాదిరిగానే ప్రత్యేక చట్టం తీసుకొచ్చి తమ నచ్చేలతను నిరూపించుకోవాలని రవీంద్రకుమార్ కోరారు.

కులాంతర వివాహాలకు పెరిగిన ప్రోత్సాహకం

50వేల నుంచి రెండున్నర లక్షల బహుమతి

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): కులాంతర వివాహాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహక బహుమతని భారీగా పెంచి అందిస్తోంది. ఎస్సీలకు చెందిన యువతీ, యువకులను వివాహం చేసుకున్న వారికి నజరానా పెంచడం ద్వారా వీటిని ప్రోత్సహించాలని నిర్ణయించింది. ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది.

జిల్లాల్లో ఎస్సీ కులాంతర వివాహాల ప్రోత్సాహకాల అమలు బాధ్యతలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారులకు అప్పగించారు. గతంలో కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రూ.50 వేల ప్రోత్సాహకం ఇస్తుండగా ఆ మొత్తాన్ని రూ.2.50 లక్షలకు పెంచారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలు సమాజంలో పరిమాణాలను దీటుగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎస్సీలకు బాసటగా నిలుస్తోంది. జంటకు రూ.2.50లక్షల ప్రోత్సాహక అవార్డును అందించనున్నారు. ఇందుకు సంబంధిత శాఖ అధికారులు మార్గదర్శకాలను జారీ చేశారు. కులాంతర వివాహం చేసుకున్న జంటలు ప్రోత్సాహకం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వధువు, లేదా వరుడు కులాంతర వివాహం చేసుకొని ఉండాలి. వధువు, వరుడు రూ.2లక్షలలోపు ఆదాయం కలిగి ఉండాలి. గత అక్టోబర్ 30 తర్వాత చేసుకున్న కులాంతర వివాహాలకు ఈ ఇన్సెంటివ్ అవార్డును అందించనున్నారు. కులాంతర వివాహ ప్రోత్సాహక అవార్డుకు ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా జతపర్చాలి. ఇద్దరికీ సంబంధించిన ఆధార్‌కార్డులు జత చేయాలి. వధూవరులు బ్యాంకులో జాయింట్ అకౌంట్ కలిగి ఉండాలి. వధూవరుల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలి. వివాహం జరిగినట్లు రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. కులాంతర వివాహం చేసుకున్నట్లు సాక్షుల ఆధార్ కార్డులు సైతం జత చేయాలి. వధూవరుల పూర్తి చిరునామాను పొందుపర్చాలి. వీటిని జోడించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ వివరా ఆధారంగా విచారణ చేసిన అనంతరం నజరానాను వారి జాయింట్ అకౌంట్‌లో జమచేసేలా మార్గదర్శకాలను రూపొందించారు.

మహారాష్ట్రలో భూప్రకంపనలు

ముంబయి, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : మహారాష్ట్రలోని పల్ఘర్ జిల్లాలో భూప్రకంపనలు సంభవించాయి. దహను తాలుకాలోని దుండల్‌వాడి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు మూడు సార్లు భూమి కంపించింది. ఆ గ్రామంలో భూమి కంపించిన మాట వాస్తవమేనని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ కైలాష్ షిండే స్పష్టం చేశారు. శనివారం తెల్లవారుజామున 5:22 గంటలకు భూమి కంపించగా, రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 3.9గా నమోదైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:26 గంటలకు తొలిసారిగా భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.2గా నమోదు కాగా, శుక్రవారం రాత్రి 9:55 గంటలకు రెండోసారి భూమి కంపించింది. ఈ సమయంలో భూకంప తీవ్రత 3.4గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూమి స్వల్పంగా కంపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. శనివారం తెల్లవారుజామునసైతం భూ ప్రకంపనలు రావటంతో స్థానికులు ఒక్కసారిగా ఇళ్ల నుండి బయటకి వచ్చారు. వరుసగా భూ ప్రకంపనలు చోటు చేసుకుంటుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళన స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

నిరంతర కరెంట్‌తో మారిన తెలంగాణ ముఖచిత్రం

వెలుగులు విరజిమ్ముతున్న ఏకైక రాష్ట్రం మనదే
తెలంగాణ సిఎం కెసిఆర్ నిర్ణయాలతో అభివృద్ధి పరుగు
విద్యుత్ సబ్‌స్టేషన్..ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పువ్వాడ
రైతులను ఆదుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్న మంత్రి

ఖమ్మం,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చీకటి అవుతుందన్న చోట బ్రహ్మాండమైన అభివృద్ధి చేసుకుంటున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఇవాళ తెలంగాణలో 24 గంటల కరెంట్‌తో వెలుగులు విరజిమ్ముతున్నాయని అన్నారు. అలాగే రైతులకు కూడా ఉచితంగా 24 గంటల కరెంట్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. సిఎం కెసిఆర్ వల్లనే ఇది సాధ్యమయ్యిందన్నారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం లంకాసాగర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మంత్రి శనివారం నాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఎమ్మెల్సీ బాలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాధించిన తొలి ఘనత కరెంట్ సమస్యను అధిగమించడమేనన్నారు. అడిగిన చోట ప్రభుత్వం సబ్ స్టేషన్‌ను నిర్మిస్తోందన్నారు. దేశంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ఇంతకన్నా అభివృద్ధి మరోటి ఉంటుందా అని ప్రశ్నించారు. కరెంట్ కోసం పోరాటలు మటుమాయమయ్యాని అన్నారు. కోతలకు కాలం చెల్లిందన్నారు. కరెంట్ కోతతో పరిశ్రమల మూత అన్న ప్రస్తావన లేకుండా పోయిందన్నారు. ఇకపోతే కల్లూరు మండలం కొర్లగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అనంతరం ధాన్యం రైతులతో మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించిన ఘనత సిఎం కెసిఆర్‌దన్నారు. రైతులు ఎక్కడికో వెళ్లి ధాన్యం అమ్ముకునే ఆగత్యం లేకుండా ఎక్కడికక్కడే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతులు తాము పండించిన పంటను మధ్య దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొంది రైతు కుటుంబాలు ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అన్నదాతలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ.. అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతులకు ఎదురు పెట్టుబడి ఇస్తున్న ఎకైక రాష్ట్రం అని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నా యని దీని ద్వారా ప్రజలు సుఖసంతో షాలతో జీవనం గడుపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ , జేసీ హనుమంత్ కొడింబా , ఎంపీ నామ నాగేశ్వరరావు , ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ , ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య , వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కొర్లగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం రైతులతో జరిగిన కార్యక్రమంలోమాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్. చిత్రంలో ఎంపి నామా నాగేశ్వర రావు తదితరులు ఉన్నారు.

దేశంలోని వ్యవస్థలను.. మోదీ నాశనంచేశారు

– ఆర్థిక మాంద్యం దేశాభివృద్ధిని తిరోగమనంలో తీసుకెళ్తుంది
– కేసీఆర్ రాష్ట్రాన్ని బాకీల తెలంగాణగా మార్చారు
– కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబర్14(ఆర్ఎన్ఎ) : విభజించి పాలించు తరహాలో దేశంలో వ్యవస్థలను ప్రధాని మోడీ నాశనం చేశారన్నారు కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో.. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారత్ బచావో నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో రేవంత్ మండిపడ్డారు. ఆర్థిక మాంద్యం దేశాభివృద్ధిని తిరోగమనంలో తీసుకెళ్తుందన్నారు. దేశంలో శాంతి భద్రతలు కరువయ్యాయని.. మోదీ నియంతృత్వ విధానాలను ఎండగట్టేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. మోదీ దేశంలోని వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. నోట్ల రద్దు వికటించి ఆర్థిక పరిస్థితి మందగించిందని.. సమస్యలపై కలుద్దామంటే ప్రధాని అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రాచరిక పాలనలో తెలంగాణ బందీ అయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ దోపిడీ ఆపితేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. మిగులు రాష్ట్రాన్ని బాకీల తెలంగాణగా మార్చారన్నారు. కేసీఆర్ కుటుంబంలో నలుగురు మాత్రమే శ్రీమంతులు అయ్యారని, రాష్ట్రం మాత్రం దివాలా తీసిందని రేవంత్ సంచలన ఆరోపణలు చేశారు. కేసీఆర్ దోపిడీ ఆపేస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రేవంత్ అన్నారు.

ఆన్‌లైన్‌లో గ్రామాల వారిగా వివరాలు

మెదక్,డిసెంబర్14(నేటినిజం ప్రతినిధి): మారుమూల ప్రాంతాల్లోని గ్రామాల వారీగా ప్రస్తుతం ఉన్న కావాల్సిన మౌలిక వసతులపై సర్వే చేపట్టి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీవో జ్యోతిరెడ్డి అన్నారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఐకేపీ కేంద్రాలు ఉన్నాయా..., ఎంతమంది ప్రభుత్వ పథకాలు లబ్దిపొందారు..., ఎంత మంది లబ్దిపొందాల్సి ఉంది... అనే తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల నుంచి రుణాలు ఎంతమంది పొందారు, ఇంకా పొందాల్సిన వారు ఎంతమంది ఉన్నారు... అని అడిగారు. ఆదర్శ గ్రామాలుగా రూపు దిద్దుకోవాలంటే ఎలాంటి చర్యలు తీసు కోవాలి, ప్రభుత్వ పథకాలు ఎంతమందికి అందాయి తదితర అంశాలను కార్యదర్శు లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని సేకరించాలన్నారు. సేకరించిన పూర్తి వివరాలను గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

పెళ్లి ఊరేగింపులో విషాదం

నృత్యం చేస్తూ పెళ్లికూతరు తండ్రి మృతి

కరీంనగర్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): పెళ్లి ఊరేగింపులో విషాదం నెలకొంది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన మేకల దాసు తన పెద్ద కుమార్తె వివాహం ఊరేగింపులో నృత్యం చేస్తూ గుండె పోటు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో బంధువులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. తండ్రిమరణంతో పెళ్లి కూతురు కన్నీరుమున్నీరయ్యారు.

పాస్ పోర్టుల్లో కొత్త మార్పులు

వివరణ ఇచ్చిన అధికారులు

న్యూఢిల్లీ,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): కేరళలోని కోజికోడ్ లో పంపిణీకి సిద్ధంగా ఉన్న పాస్ పోర్టు పుస్తకాల్లో కమలం చిహ్నాన్ని ముంద్రించినట్టు ఆరోపణలొచ్చాయి. ఈ ఆరోపణలపై కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ వివరణ ఇచ్చింది. నకిలీ పాస్ పోర్టులను గుర్తించడం, భద్రతా ప్రమాణాల పెంపుదలలో భాగంగానే కొత్త పాస్ పోర్టు పుస్తకాలపై కమలం చిహ్నాన్ని ముద్రించామని తెలిపింది. ఒక్క చిహ్నాలే కాదు, కొత్త పాస్ పోర్టుల్లో మరిన్ని మార్పులు చోటు చేసుకోనున్నాయి. గతంలో పాస్ పోర్టు రెండో పేజీలో అధికారి సంతకం ఉండేది. ఇప్పుడు ఈ స్థానంలో కమలం గుర్తు ఉండనుంది. వంతుల వారీగా ఇతర జాతీయ చిహ్నాలను ఆ స్థానంలో ముద్రించనున్నారు. పాత పాస్‌పోర్టులో వ్యక్తి పేరు, చిరునామా, ఇతర వివరాల కోసం వేర్వేరు కాలమ్స్ ఉండేవి. కానీ కొత్త పాస్ పోర్టులో వేర్వేరు కాలమ్స్ ఉండవు. పాస్ పోర్టుల కోడ్‌లలోనూ మార్పులు చేశారు.

సాగర్ ఎడమకాల్వ సామర్థ్యం పెంపు

పరిస్తితిని పరిశీలించిన రిటైర్డ్ ఇంజనీర్ల బృందం

నల్లగొండ,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్ ఎడమ కాల్వను రిటైర్డ్ ఇంజినీర్ల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. దామరచర్ల సమీపంలో కొండ్రపోలు వద్ద గల కాల్వలను విశ్రాంత ఇంజినీర్ల బృందం పరిశీలిస్తుంది. హుజూర్‌నగర్ ప్రజా కృతజ్ఞత సభ సందర్భంగా సీఎం కేసీఆర్ నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు అదేవిధంగా లిఫ్ట్ లిరిగేషన్ వ్యవస్థలను పరిశీలించి చర్యలు చేపడతామని పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ సూచన మేరకు రిటైర్డ్ ఇంజినీర్ల బృందం కాల్వల పరిశీలిన చేపట్టింది. ఎడమకాల్వ పరిధిలో చివరి ఆయకట్టు భూములకు నీరు అందించే అంశం, అదేవి